అక్టోబర్-2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,



**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| తింటే చస్తావ్ | కె.ఇ. రాజేంద్ర | 08 |
| దేవున్ని వెదకండి | హన్నాకృప డెస్క్ | 09 |
| ప్రభువగు యెహోవాయే నా బలము | | 10 |
| దేవుడిచ్చిన పరిచర్య | | 12 |
| నమ్మదగిన దేవుడు | సాక్ష్యము | 14 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| షిఫ్రా, పూయా | స్త్రీల కొరకు | 20 |
| ప్రేమించుట | చిన్నపిల్లల పేజి | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-15 | | 24 |





సీరియల్ నంబరు

# సంపాదకీయం....

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

మా తండ్రిగారైన కొడవటికంటి సామ్యేల్ రాజేంద్రగారు మన మధ్య నుండి వెడలిపోయి మూడు నెలలు అయింది. అయినప్పటికీ ఆయన రచనల ద్వారా మన మధ్యలోనే ఉన్నాడు. నాన్నగారు చనిపోయిన విషయం ఆలస్యంగా తెలుసుకున్నవారు ఫోన్ చేసి వారి సంతాపాన్ని తెలియజేస్తూనే ఉన్నారు. నాన్నగారి సాహిత్య పరిచర్యలో భాగంగా ఆయన అనేకమంది ఆప్తులను సంపాదించుకున్నాడు. కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా ప్రేమ, ఆదరణ చూపించిన వారందరికీ నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నాన్నగారు నడవలేని స్థితిలో ఉన్నప్పటికీ ఆయనను ప్రేమించే వారిని చూడాలన్న తపన ఆయనకు ఎప్పుడూ ఉండేది. చాలామంది నాకు ఫోన్ చేసి, నాన్నగారి ఆరోగ్యం గురించి అడుగుతుండేవారు. దేవుడు ఎంత గొప్పవాడు? నాన్నగారు అనేకమంది ప్రేమను పొందేలా చేశాడు. 2000వ సంవత్సరంలో చనిపోవాల్సిన నాన్నగారికి దర్శనము ద్వారా కనబడి పూర్తి స్వస్థతనిచ్చాడంటే, ఆ తర్వాత 20 సంవత్సరాలు ఎంత బలమైన సేవ చేయాలో నిర్ణయించబడింది. 80 సంవత్సరాల వయస్సులో కూడా సైకిల్ త్రొక్కగలిగేటంత బలము నాన్నగారికి దేవుడు అనుగ్రహించాడు. నెలలో సుమారు 20 రోజులు అలుపు ఎరుగకుండా ఉండేటంత ఆరోగ్యము ఇచ్చి ఆయన బిడ్డలైన అనేకమంది దగ్గరకు నాన్నగారిని నడిపించాడు.

నాన్నగారు నాకు అప్పగించిన బాధ్యతలో భాగంగా ఆయన రచనలన్నిటిని తిరిగి ముద్రించుటకు ప్రయత్నిస్తున్నాను. ముందుగా నాన్నగారు బైబిల్లోని వ్యక్తుల గురించి వ్రాసిన నవలలు అన్నింటిని ముద్రించడానికి డి.టి.పి. వర్కు జరుగుతుంది. జప్నత్పనేహు–ఆసెనతు కలిపి ఒకే పుస్తకంగా, అలాగే అపొస్తలుడు–బర్నబా–తిమోతి పుస్తకాలు కలిపి ఒకే పుస్తకంగా ఇప్పటికే ముద్రించబడ్డాయి. ఇంక మిగిలిన పుస్తకాలలో 'యేసుకథ' మూడు భాగాలు, నా స్నేహితుడు, నా చిత్తానుసారుడు, గోత్రకర్త, నాజరు, నా దూత, నా కుమారి, హదస్సా పుస్తకాలను ప్రింటింగ్ కొరకు సిద్ధం చేసి ఉంచాము. వాటి ముద్రణకు సుమారు 5 లక్షల రూపాయలు అంచనా. నాన్నగారిని ప్రేమించే దేవుడు తగిన సమయంలో సహాయపడతాడనే నమ్మకంతో ఎదురు చూస్తున్నాను. 'అపొస్తలుడు' ముద్రణకు డా॥ ఫ్రెడ్రిక్ నతానియేల్‌గారిని వాడుకున్న దేవుడు మిగిలిన పుస్తకాలను ముద్రించడానికి ఆయన బిడ్డలను ప్రేరేపిస్తాడన్న విశ్వాసంతో పుస్తకాలన్నీ ముద్రణకు సిద్ధం చేసి ఉంచాము. ఈ విషయమై మీ అనుదిన ప్రార్థనలలో గుర్తు చేసుకోవలసినదిగా కోరుతున్నాను.

–కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్



# జఫ్నత్పనేహు

(యోసేపు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

"అదేమిటి, మీది ఏ భాష" అడిగాడతను.

"హెబ్రీభాష" చెప్పాడు యోసేపు.

"నీ తలమీద గుడ్డ చూసి అదే అనుకున్నాను. నిన్ను మన యజమాని కొన్నాడు. రాత్రి ఇంటికి తీసుకొచ్చారా?" అడిగాడు అతను.

"ఔను" అన్నాడు యోసేపు.

"ఎడమ ప్రక్కన నీళ్ళతొట్టి దగ్గర ముఖం కడుక్కో కొంచెంసేపట్లో పనివాళ్ళకి ఉదయం భోజనం పెడతారు" అన్నాడు అతను.

యోసేపు ముఖం కడుక్కొని గదిలో ఆలోచిస్తూ కూర్చు న్నాడు. ఇంతలో ఎవరో వచ్చి ఫలహారానికి రమ్మని చెప్పారు. ఐగుప్తు భాష తేలిగ్గా నేర్చుకోవచ్చు అనుకున్నాడు. భోజనాల దగ్గర క్రమం లేదు. తిన్నంత తిని అందరూ మిగిలింది తొట్లో పడేశారు. యోసేపుకు భలే విచారమేసింది. యజ మాని సొమ్ము ఎంత వృధా అయిపోతుంది! వీరందరూ మంచివారే కానీ వీరిని పట్టించుకునేవారు లేరు అను కున్నాడు.

మధ్యాహ్నం భోజనాల సమయంలో ఇద్దరు ద్వార పాలకులు తప్ప అందరూ పనివారే. బానిసలు దాదాపు ఇరవైమంది ఉన్నారు. భోజనాల కొరకు వరుసలో కూర్చు న్నారు. ఎవరూ మాట్లాడడం లేదు. యోసేపు ఒక మూలగా కూర్చున్నాడు. ఇద్దరు బానిసలు రొట్టెలు వడ్డిస్తుంటే ఇద్దరు వచ్చి యోసేపు ముఖం పరీక్షగా చూసి రొట్టెలు వడ్డించి వెళ్ళిపోయారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా అందరూ గాలి పీల్చినంత నిశ్శబ్దంగా ఉన్నారు.

యోసేపు తలెత్తి చూశాడు. వాకిలి దగ్గర ఒక స్త్రీ నిలబడి అందర్నీ చూస్తుంది. ఇద్దరు బానిసలు ఆమెకు ఇరువైపులా నిలబడి ఉన్నారు. బానిసలు పూర్తి నలుపులో ఉంటే ఆమె పూర్తిగా తెల్లగా ఉంది. ఆమె కళ్ళు ఒకరి తర్వాత ఒకరి మీద ఆగుతూ కదులుతున్నాయి. ఆమె ముఖం చూసిన వాళ్ళు ఆమె మీద నుండి తమ చూపు త్వరగా మళ్ళించలేనంత అందంగా ఉందామె. ఆమె యజమానురాలని అనుకున్నాడు. వెంటనే యోసేపు తనకు తెలియకుండానే లేచి నిలబడ్డాడు. యోసేపు లేస్తుంటే ఆమె కళ్ళు యోసేపును చూశాయి. ఆమె యోసేపు దగ్గరకు వచ్చి ఐగుప్తు భాషలో "ఎవరు?" అని అడిగింది.

"యోసేపు" అన్నాడు.

ఆమెకు అర్థమయింది – అతను ఈ దేశస్థుడు కాదని. అందర్నీ ఒకసారి పరీక్షగా చూసి తిరిగి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన వెంటనే బానిసలంతా లేచి ఎవరికిష్టం వచ్చినట్లుగా వాళ్ళు మాట్లాడుకుంటూ భోజనం చేస్తున్నారు. భోజనం అయిన తర్వాత తన గదికి వచ్చి కూర్చున్నాడు. అంతకుముందు ఆ గదిలో వేరొక మధ్య వయస్కుడు పండుకొని ఉన్నాడు. అతని ఆకారం చూస్తే అతను బానిస కాదని తెలుస్తుంది.

యోసేపు కదలకుండా, శబ్ధం చేయకుండా చాప మీద పండుకున్నాడు. ముందున్న వ్యక్తి నిద్రపోతున్నాడు. యోసేపు కూడా నిద్రపోయాడు. సాయంకాలం నిద్ర లేచేసరికి ముందున్న వ్యక్తి మూలుగుతూ ఉన్నాడు. యోసేపు అతని నుదుటి మీద చెయ్యి వేసి చూస్తే ఒళ్ళు కాలిపోతున్నట్లు ఉంది. అతనిని పలకరించి మంచినీళ్ళు ఇస్తే త్రాగాడు. దుప్పటి కప్పి బయటకు వచ్చి ఉదయం సిరియాభాషలో మాట్లాడినతని కోసం వెదికితే అరగంట తర్వాత దొరికాడు. ఆయన వచ్చి చూచి ఇంకొకాయన్ని తెచ్చాడు. అతను వైద్యుడు. ఏవో కొన్ని గుళికలు ఇచ్చి వెళ్ళిపోయాడు. యోసేపు వాటిని జాగ్రత్తగా అక్కడ ఉన్న గిన్నెల మీద

పెట్టాడు. సాయంకాలం నాలుగు గంటలకు అతనికి మెళకువ వచ్చింది. యోసేపు అన్నం వండేవాళ్ళ దగ్గరికి వెళ్ళి వేడిగా కొంత గంజి తెచ్చి ఇచ్చాడు. తర్వాత ఆయనకు సంబంధించిన వాళ్ళు వచ్చి చూసి వెళ్ళారు.

ఆ రాత్రి యోసేపుకి భోజనం చెయ్యాలనిపించలేదు. గదిలోనే ఉండి అతనికి నాలుగు గంటలకి ఒకసారి మాత్రలు వేస్తూ మధ్యరాత్రిలో నిద్రపోయాడు. ఉదయం బాగా తెల్లవారిన తర్వాత మెళకువ వచ్చి చూస్తే గదిలో ఎవరూ కనబడలేదు.

రాత్రి జ్వరంతో ఉన్నతను నవ్వుతూ లోపలికి వచ్చి యోసేపు ప్రక్కన కూర్చున్నాడు. అతను బాగా చదువుకున్న వాడు. హెబ్రీభాష హెబ్రీయునికి తప్ప ఎవ్వరికీ తెలీదు. సిరియా భాష చదువుకున్న వాళ్ళందరికీ తెలుసు. యోసేపు యోగక్షేమాలు అడిగాడు. యోసేపు కృతజ్ఞత తెలుపుకున్నాడు. అతనిని ఐగుప్తు భాష నేర్పించమన్నాడు. ఐగుప్తు భాష మాట్లాడడం తేలికే! వ్రాయటం కష్టం. ముందు మాట్లాడడం నేర్చుకోవాలంటే సిరియాభాష మర్చిపోవాలన్నాడు.

"నీ యజమాని పోతీఫరు చాలా బాధ్యతగల ఉద్యోగి. రాజుగారి అంగరక్షకులందరి మీద అధికారి. గొప్ప శూరుడు. అయితే దయగలవాడు. ప్రతిరోజు రాత్రి పదకొండు గంటల వరకు ఆటపాటలతో ప్రొద్దుపుచ్చు తుంటారు. ఉదయాన్నే రాజప్రాంగణంలో ఉంటారు. అందువల్ల ఇంటి విషయాలు పట్టించుకోవటంలేదు. ఇంతకుముందు గృహనిర్వాహకుడు ఉండేవాడు. అయితే అతని వయస్సు పెరిగి కాలధర్మం చేసినందున..." అంటుంటే అమ్మగారి దగ్గరుండే బానిస వచ్చి "యోసేపును అయ్యగారు పిలుస్తున్నారు" అని చెప్పి వెళ్ళాడు. యోసేపు గుండె దడదడ కొట్టుకుంది.

అయితే, ఆ గదిలోని వ్యక్తి అక్షాపు "వెంటనే స్నానం చేసి వస్త్రాలు మార్చుకొని తలకి నూనె పెట్టుకో. శుభ్రంగా లేకపోతే ఆయన కోప్పడతారు" అన్నాడు.

"నాకు వేరే వస్త్రాలు లేవు" అని చెప్పాడు యోసేపు.

"అయినా స్నానం చేసి నూనె రాసుకొని వెళ్ళు" అన్నాడు. యోసేపు గబగబా స్నానం చేసి. తలకు నూనె రాసుకొని సిద్ధపడ్డాడు. అక్షాపు యోసేపును వెంటబెట్టుకొని, పోతీఫరు ఇంట్లోకి తీసుకొని వెళ్తున్నాడు.

చాలా పెద్ద ఇల్లు, ఎన్ని గదులున్నాయో, ఎంతమంది పనివారున్నారో, ఎటు తూర్పో ఎటు పడమరో అర్థం కావటం లేదు. అక్కడ ఉన్న పూలకుండీలో పూలు పెట్టబడి ఉన్నాయి. ఎటు వెళ్ళినా కిటికీలకు తెరలు వ్రేలాడుతున్నాయి.

అన్నీ చల్లని గదులే. హాయిగా ఉంది. కొంచెంసేపటికి ఒక ద్వారం దగ్గర ఆగాడు. ద్వారం మూయబడి ఉంది. ఇద్దరు షండులు కాపలా కాస్తున్నారు. యోసేపు, అక్షాపు ఆగారు. అక్షాపు వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. కొంచెం సేపటికి లోపల్నుండి ఒక బానిస వచ్చి యోసేపును లోపలికి తీసుకొని వెళ్ళాడు.

యోసేపు పోతీఫరు గదిలోకి వెళ్ళాడు. పోతీఫరు ఇంట్లో వేసుకునే దుస్తుల్లో చక్కగా ఉన్నాడు. 'ఉద్యోగ దుస్తులలో కంటే ఈ దుస్తుల్లో చక్కగా ఉన్నాడు' అనుకున్నాడు. ఎత్తైన మంచం మీద పోతీఫరు, అతని ప్రక్కనే అతని భార్య కూర్చొని ఉన్నారు. యోసేపు నేలమట్టుకు వంగి నమస్కారం చేశాడు.

"నీ పేరు?" అడిగాడు పోతీఫరు.

"యోసేపు, హెబ్రీయుడను" అని చెప్పి తన తల్లి దండ్రుల గురించి, అన్నదమ్ముల గురించి, యూషును, వియాన్, ఒంటెల ప్రయాణం అన్నీ చెప్పాడు. పోతీఫరు, ఆయన భార్య మధ్యమధ్యలో ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ జరిగిన సంగతులన్నీ ఉత్సాహంగా విన్నారు.

"నీకు నీ తండ్రి ఇంటికి వెళ్ళాలని ఉందా?" అని అడిగాడు పోతీఫరు.

"లేదు" అని అన్నప్పుడు పోతీఫరు, అతని భార్య ఆశ్చర్యంగా చూశారు.

"ఎందుకు?" అని ప్రశ్నించాడు పోతీఫరు.

"నేను మా ఇంటికి వెళ్తే మా అన్నల దుర్మార్గత మా తండ్రికి తెలిసిపోతుంది. నా తండ్రి హృదయం మీద కత్తి పెట్టినట్లుగా ఉంటుంది. మీరు ఈ రోజున నా తండ్రికి కబురు చేస్తే మీరు నన్ను కొన్న సొమ్ముకు పదంతలు

చెల్లించి తీసుకొని పోగలడు. అంటే నేను మీ ఇంట్లో బానిసగా ఉండటం దైవేచ్ఛ అని అనుకుంటున్నాను" అని చెప్పి నేల వరకు వంగి నమస్కారం చేశాడు.

పోతీఫరు కొంచెంసేపు ఏమి మాట్లాడలేదు. మంచం దిగి నడుచుకుంటూ యోసేపు దగ్గరకు వచ్చాడు. ప్రక్కనున్న షండుని చూచి పిలిచి, "అక్షాపుని పిలువు" అన్నాడు. కొంచెంసేపట్లో అక్షాపు వచ్చాడు.

పోతీఫరు అక్షాపుతో "యోసేపుకు నాలుగు జతల దుస్తులు, చెప్పులు ఏర్పాటు చెయ్యి. అతనికి అనువైన చోట బస ఏర్పాటు చెయ్యి. ఏదైనా అవసరమైతే అమ్మగారిని అడిగి తీసుకో. యోసేపుకు ఏ పని చేతనైతే ఆ పనిని చెయ్యమను" అని చెప్పి పంపించి వేశాడు.

గదికి వచ్చిన తర్వాత "అన్నిటికంటే నీకే పని ఇష్టం?" అని అడిగాడు అక్షాపు యోసేపును.

"తోటపని" చెప్పాడు యోసేపు.

ఉదయాన్నే ఎంతో ఉల్లాసంగా నిద్రలేచాడు యోసేపు. వెంటనే తోటలోకి వెళ్ళాడు. తోట అని ప్రత్యేకంగా ఏమీ లేదు. పూలచెట్లు ఎక్కడ పడితే అక్కడ పడేశారు. కాని వాటి ఆలనాపాలనా ఎవరూ చూడలేదు. యోసేపు ఆ చెట్లని ప్రధాన ద్వారం నుండి భవంతి వరకు ఉన్న మార్గానికి ఇరువైపులా వరుసగా, చక్కగా పెట్టాడు. వాటికి నీరు సరిగ్గా అందేటట్లు కాలువలు తీశాడు. ప్రాకి అల్లుకునే పూలచెట్ల ప్రవేశ ద్వారానికి పైగా ప్రాకుతున్నట్లుగా అల్లించాడు.

ఇటువంటివి దాదాపు ఇరవై రకాలు రాజమందిరం కిటికీల వరకు అల్లుకుపోయి రాత్రులు కమ్మని పూల వాసనతో భవనమంతా నిండిపోయేది.

రాజప్రాసాదంలో ఇంకా అనేకమంది ముఖ్య ఉద్యోగస్తులు ఉన్నారు. వారి స్త్రీలు పోతీఫరు ఇంటికి వచ్చేవారు. ఇంత చక్కగా తోటని అలంకరించినందుకు పోతీఫరు భార్యను మెచ్చుకొనేవారు. ఏ దాసుడు అయినా ఏ విద్యలోనైనా ఖ్యాతి గడించినా అది వాని యజమానిదే కాని, వానిది కాదు. బానిసలను ఎవరూ మెచ్చుకోరు. రాళ్ళను, తలుపులను ఎలా చూస్తారో బానిసలను కూడా అంతే! యోసేపు వచ్చిన తర్వాత తన ఇంటికి వచ్చిన అందం చూసి పోతీఫరు ఎన్నోసార్లు సంతోషించాడు. కానీ యోసేపును చూడటానికి అతనికి మనసులేదు, సమయం లేదు.

ఒకరోజు పోతీఫరు యోసేపును పిలిపించాడు. ఇప్పటికి యోసేపు తన ఇంటికి వచ్చి సంవత్సరం అయ్యుంటుంది. తన ఇల్లు, పెరటు అంతా మారిపోయింది. చక్కని వనం, శుభ్రమైన వాతావరణం. అంతా ఆహ్లాదకరమైన మార్పు. ఆ మధ్యన అక్షాపు తనతో మాట్లాడుతూ 'యోసేపు చేత్తో ఏ చెట్టు పట్టుకున్నా తెల్లవారేసరికి పూలు పూస్తుంది' అని చెప్పాడు. నిజమేననిపిస్తుంది. ఇంతమంది పని వారున్నా అందరూపనివారుగానేపనిచేస్తున్నారు. కానీ యోసేపు తన హృదయానికి ఉల్లాసం కలిగించాడు. తన గృహానికి మిగిలిన గృహాల కంటే ప్రత్యేక స్థానం తెప్పించాడు. అయినా అందుకు ప్రతిఫలం ఆశించి కాదు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

# నా చిత్తానుసారుడు



(దావీదు జీవిత చరిత్ర)

- కొదవటికంటి

తనకు వచ్చే ఆలోచనలు తలచుకొంటే తనకే విసుకే స్తుంది. తనకు స్నేహితురాళ్ళు లేరు. చిన్నతనం నుండి తాను రాజకుమార్తె అనే భావనతో ఎవరితో కలువలేదు. ఈనాడు తన హృదయం విప్పుకోవటానికి ఎవరు వస్తారు?

కళ్ళు మూసుకొని ఆలోచిస్తుంటే, విన్ని ఎప్పుడు వచ్చిందో కాని ఆ అమ్మాయి కళ్ళలో నీళ్ళు చూసి "విన్నీ" అంది. "అమ్మా బాధపడకండి, దావీదు దేవుడే దేవుడు. ఆయన ఎక్కడ ఉన్నా దేవుడు కాపాడతాడు" అంది.

"దేవుడు" అని తల ప్రక్కకి తిప్పుకుంది మీకాలు. ఇప్పుడు తనలో ఏ ఆలోచనా లేదు అంతా శూన్యం.

రామా వచ్చేటప్పటికి కొద్దిగా తెల్లవారుతుంది. గిబియా నుండి తన ప్రయాణం రహదారిని కాక చేలలో చెట్టుపొదల చాటుగా సాగింది.

సమూయేలు ఇప్పుడు శతవృద్ధుడు అయినా తన పనులు తానే చేసుకుంటుంటారు. సమూయేలుకి ఇద్దరు కుమారులు. యోవేలు, అబీయా బెయేర్షెబాలో ఉంటారు. వారు దేవునికి ఇష్టులు కారు అందువలన సమూయేలు కుమారుల దగ్గరకు వెళ్ళరు. ఆయన బేతేలు, గిల్గాలు, మిస్పా గ్రామాలకు వారం వారం వెళ్ళి వస్తుంటారు. ఈ మూడు గ్రామాలలోను రామాలో కూడా ఆయన న్యాయం తీర్చుతూ ప్రవక్తల, శిష్యుల పాఠశాలలు నడిపిస్తుంటారు.

మరి ఈ రోజు రామాలో ఉన్నారో లేదో అనుకుంటూ వచ్చాడు. సమూయేలు ఉదయ ధ్యానం ముగించి ఇంటి ముంగిట కూర్చుని ఉన్నారు. దావీదుకు ఆయనను చూడగానే ఎక్కడలేని దుఃఖం వచ్చింది. తాను చాలా చిన్నపిల్లవాడై నట్లుగా అనిపించింది.

దావీదు ముఖం చూడగానే సమూయేలు లేచి దావీదును ఆప్యాయంగా పట్టుకొని ఇంటి వెనుక ఉన్న చిన్న మందిరంలోనికి తీసుకొని వెళ్ళాడు.

కొంచెంసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు

"రాజు నన్ను చంపటానికి రెండుసార్లు ప్రయత్నిం చారు" అన్నాడు చిన్నగా. సమూయేలు తలపైకి ఎత్తలేదు. ఆయన తెల్లని గడ్డం ఆయన రొమ్మును కప్పి ఉన్నది. తెల్లని తల వెంట్రుకలు మెడను కప్పిఉన్నాయి.

"తన ప్రజలైన ఇశ్రాయేలుకు నిన్ను రాజుగా అభిషేకిం చమని ప్రభువు నాతో చెప్పలేదా!" అని తలపైకెత్తి "ఇశ్రా యేలురాజును ఎవరూ చంపలేరు. సౌలుచేస్తున్న కార్యములు అతన్ని కీడు యొద్దకు నడిపిస్తున్నాయి" అన్నాడు సమూయేలు.

"మీరు నన్ను అభిషేకించేటంత వరకు నా జీవితం ఎంతో నెమ్మదిగా ఉంది" అన్నాడు. తనలోతాను మాట్లాడు కుంటున్నట్లుగా.

"గొఱ్ఱెల దొడ్డిలో నుండి నిన్ను సింహాసనం మీద కూర్చొండబెట్టు వరకు ఆయన నీకు ఇచ్చే తర్ఫీదులో ఇది ఒక భాగం మాత్రమే. సింహమును, ఎలుగుబంటిని, గొల్యాతును చంపటం మొదటి మెట్టు. సహస్రాధిపతిగా యుద్ధములు చేసి రాజునకు అల్లునిగా మారటం రెండవ మెట్టు. ఇప్పుడు ఈ విధంగా నా దగ్గరకి రావటం, నీ అరణ్య వాసమునకు ప్రారంభం. అపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు" అన్నాడు సమూయేలు.

ఆయన లేచి నిలబడి, "నాయోతుకు వెళ్దాం పద అక్కడ కొన్ని దినాలు నువ్వు విశ్రాంతి తీసికొనిన తర్వాత ఆలోచించవచ్చును. అయితే ఒక విషయం గుర్తుపెట్టుకో, రెండవ మెట్టు నుండి మూడవ మెట్టు ఎక్కావు. మరలా నీవెన్నడూ రెండవ మెట్టు ఎక్కవు" అన్నాడు సమూయేలు. ఆ మాటలు ప్రవచిస్తున్న ప్రవక్త మాటలవలే వున్నాయి. రెండవ మెట్టు అని తన మనసులో అనుకున్నాడు. గిబియా అక్కడ తన హృదయ వీణ మీకాలు. ఆమె మాట ఏమిటి?

సమూయేలుని మీకాలు విషయం అడగాలా వద్దా అని ఆలోచించాడు. తెగించినట్లుగా "మరి నా భార్య" అన్నాడు.

"నీవైనవి ఏవి నీ దగ్గర నుండి శాశ్వతంగా పోవు కొన్ని..." అని ఆగి "కొంతకాలం దూరం" అని నాయోతుకు బయలు దేరాడు. దావీదు మౌనంగా ఆయనని వెంబడిం చాడు. తన హృదయ ఆలోచన అంతా మీకాలు మీదనే లగ్నమై ఉంది. మీకాలును విడచి వుండటం అని తలుచు కుంటే గుండె చల్లగా అయినట్లు భావన. ఈ భావన భరించలేనిది అనుకున్నాడు.

ఆ సాయంకాలం కొనన్యా సౌలురాజు దర్శనం చేసు కొని దావీదు నాయోతులో ఉన్నాడని చెప్పాడు. సమూయేలు కూడా నాయోతులోనే ఉన్నాడని చెప్పాడు. సమూయేలు పేరు వినగానే సౌలు నిస్సత్తువగా అయి పోయాడు. అయినా తాను సమూయేలును చూసి దాదాపు ఇరవై సంవత్సరాలు గడచిపోయాయి.

వెంటనే కొంతమంది భటులను పంపి దావీదును పట్టుకొని రమ్మన్నాడు. నాయోతులో రెండు పర్ణశాలలో శిష్యుల సముదాయం కూర్చుని, కొందరు ప్రవచిస్తుంటే కొందరు పాటలు పాడుతున్నారు. సమూయేలు వారందరికి ఎదురుగా ఒక అరుగు మీద కూర్చుని ఉన్నారు. భటులు వచ్చి సమూయేలున్న పర్ణశాలలో ప్రవేశించి, సమూయేలుని చూడగానే వారి చేతులలోని ఈటెలు క్రిందపడిపోయాయి. అందరూ శిష్యుల వెనుక భాగంలో కూర్చుని కీర్తనలు పాడటం ప్రారంభించారు.

నాయోతు సౌలు గిబియాకి అయిదు మైళ్ళ దూరంలో ఉన్నందున తన భటులకు సంభవించినది వెంటనే సౌలుకు తెలియపర్చారు. వెంటనే మరికొందరు భటులను పంపిం చాడు వారు కూడా అదేవిధంగా సమూయేలు ఆశ్రమంలో చేరిపోయారు. సాయంకాలం మూడు గంటలకు సౌలురాజు మూడవసారి భటులను పంపించాడు. వారు కూడా ముందు పంపబడిన వారివలె అయ్యారు.

సాయంకాలం ఆరుగంటలకు సౌలునకు తెగింపు వచ్చింది. కొనన్యాని మరి ఇద్దరు భటులను తీసుకొని నాయోతుకు బయలుదేరాడు. రామాదగ్గరలో ఉన్న ఎత్తైన ప్రదేశమును సేఖూ అంటారు. అక్కడ ఒక పెద్దబావి ఉంది. అక్కడ మంచినీళ్ళు త్రాగి దాని కాపలాదారుని పిలిచి "సమూయేలు, దావీదు ఎక్కడ వున్నారు?" అని అడిగాడు.

"నాయోతులో ఉన్నారు" అని చెప్పాడు. ఆ మాట వినగానే సౌలు రాజునకు ఒక విధమైన ఉద్వేగం కలిగింది. అయితే పర్ణశాలలో ప్రవేశించగానే తన పైవస్త్రము తీసివేసి చేతిలోని ఈటె ప్రక్కన పడవేసి నేల మీద సాగిలపడ్డాడు.

కొంచెంసేపటికి లేచి కూర్చొని ప్రవచించటం మొదలు పెట్టాడు. కొంచెంసేపు కీర్తనలుపాడి మళ్ళీ పడిపోవడం ఈ విధంగా మరునాటి రాత్రి వరకు ప్రకటిస్తూనే ఉన్నాడు.

దావీదు సమూయేలునకు ఏమి చెప్పకుండా లేచి గిబియాకి వెలుపల ఉన్న యోనాతాను దగ్గరకు ఆ రాత్రికి రాత్రి వచ్చాడు. దావీదును చూడగానే యోనాతాను ఎదురువెళ్ళి గట్టిగా కౌగిలించుకొన్నాడు.

"నేను ఏమి చేసితిని? నేను చేసిన దోషమేమి?" అని అడిగాడు. యోనాతాను స్పర్శతో దావీదుకు దుఃఖం పొర్లినది. అయినా అది అణచుకొని కొంచెంసేపు ఏమి మాట్లాడలేదు. "నా ప్రాణము తీయవెదకునట్లు నీ తండ్రి దృష్టికి నేను చేసిన పాపమేమిటి?" అన్నాడు.

"ఆ మాట నీవెన్నటికి అనుకొనవద్దు. నీవు చావవు" అన్నాడు యోనాతాను. సమూయేలు నిన్న ఉదయం తనతో మాట్లాడిన మాటలు గుర్తుకు వచ్చాయి.

"నాకు తెలియజేయకుండా నా తండ్రి చిన్నకార్యమే గాని పెద్దకార్యమే గాని చేయడు. నా తండ్రి ఇదెందుకు నాకు మరుగు చేయును?"అని దావీదును ఓదార్చ బోయాడు.

"నేను నీ దృష్టికి అనుకూలుడనను సంగతి నీ తండ్రి రూఢీగా తెలిసికొని యోనాతానుకు చింతకలుగకుండుటకై ఇది అతనికి తెలుపననుకొనుచున్నాడు. అయితే యెహోవా జీవముతోడు, నిజంగా నాకును మరణమునకును అడుగు మాత్రమున్నది" అని అన్నాడు దావీదు.

యోనాతాను అది నిజము కాదన్నట్లుగా నవ్వాడు.

"ఇది ప్రమాణ పూర్వకము" అని అన్నాడు దావీదు. ఇప్పుడు నన్ను ఏమి చెయ్యమంటావో నాకు చెప్పు. నువ్వు చెప్పినట్లుగా చేస్తాను" అన్నాడు యోనాతాను. **(సశేషం)**

# ‘తింటే చస్తావ్’





భలే చెప్పావులే, తింటే ఎవరైనా చస్తారా అని అనాలను కుంటున్నారా? తినడం వల్లనే మనకు చావు వచ్చింది అని బల్లగుద్ది మరీ చెప్తాను. మన తాత, అవ్వ ఉన్నారు కదా, అదేనండీ, ఆదాము, హవ్వలు వాళ్ళ వల్లనే కదా మనకి చచ్చే చావొచ్చింది. వాళ్ళు పండు తినకుండా ఉండి వుంటే ఈ పాటికి మనమంతా ఎంచక్కా ఏదెను తోటలో కావలసిన పండ్లు తిని హ్యాపీగా బతికేసేవాళ్ళం కదా. తినడానికి దేవుడు కావలసినన్ని పండ్లు ఇచ్చినా అత్యాశకు పోవడం వలన ఈ రోజు చావుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలామంది ఏమంటారంటే అసలు దేవుడు ఆ ‘మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు వేయడం ఎందుకు? ఆ చెట్టు వేయకపోతే ఈ పరిస్థితి ఉండేది కాదు కదా అని. అలాగైతే అసలు మనుష్యులనే సృష్టించకుండా ఉంటే చెట్టు వేయాల్సిన అవసరమే ఉండేది కాదు కదా! మనం పెద్ద మేధావులము కాబట్టి దేవునికి సలహాలు ఇవ్వాలి మరి. దేవుడు ఎంతో ఇష్టపడి తన కోసం చేసుకున్న మనుష్యులు తనను ప్రేమిస్తారో లేదో, తన మాట వింటారో లేదో వారిని పరీక్షించడానికి చెట్టు వేశాడు. పండు తినడంలో పాపము ఏమీ లేదు కానీ, మాట వినకపోవడమే పాపము. తినడానికి వారికి ఎన్నోరకాల పండ్లు ఇచ్చినప్పటికీ దేవుడు తినవద్దని చెప్పిన పండు తినడం వలన దేవుని ఆజ్ఞని మీరి వాళ్ళు పాపము చేశారు. ‘పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము’ (1యోహాను 3:4). హవ్వ దేవుని ఆజ్ఞను మీరి పాపము చేయడానికి కారణం ఏంటి? హవ్వకు పండు తినాలన్న ఆశ వున్నప్పటికీ చస్తామనే భయంతో తినలేదు. ఎప్పుడైతే సాతాను ‘మీరు చావనే చావరు’ అని చెప్పిందో అప్పుడు హవ్వకు ధైర్యం వచ్చింది. అంతేకాక మీరు దేవతల వలె ఉంటారని చెప్పి హవ్వని పురికొల్పింది. పండు తినాలన్న ఆశ వలన హవ్వ సాతాను ప్రలోభాలకు లొంగి దేవుని ఆజ్ఞను అతిక్రమించి పండు తినింది. మనమంతా హవ్వ రక్తం పంచుకొని పుట్టాము కాబట్టి ఆ బుద్ధులు మనకు కూడా వచ్చాయి. ‘భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొన వద్దు... నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును... మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు’ (మత్తయి 6:19,21,24) అని చెప్పినప్పటికీ ఈ లోకంలో మనకున్న ఆశలనుబట్టి సాతాను మనల్ని ప్రలోభాలకి గురిచేసి ‘డబ్బు లేకపోతే ఈ లోకంలో ఎలా బ్రతుకుతారు? డబ్బు సంపాదించు కోవడం పాపము కాదు కదా అని మనల్ని పురికొల్పి దేవుని మీద ఆధార పడకుండా చేస్తుంది. దేవుడిచ్చిన ఆరోగ్యం, తెలివితేటలు కాకుండా డబ్బుంటే చాలు ఇంకేం అవసరం లేదు అన్నంతగా మనుష్యులని ప్రలోభపెట్టడం ద్వారా మనం సాతాను మాట విని, మేమేం తక్కువ తినలేదు అన్నట్లు హవ్వ మనస్తత్వాన్ని మనం కూడా ఆపాదించుకున్నాం. దేవుని ఆజ్ఞను మీరటమే పనిగా పెట్టుకున్న మనము, ఆదాము, హవ్వలు దేవుని శాపానికి గురైనట్లు మనం కూడా దేవుని శాపానికి గురవుతున్నాము. ‘పండు’ అప్పటి మానవులకు పరీక్ష. ‘డబ్బు’ ఇప్పటి మానవులకు పరీక్ష. అప్పుడు పండు తినడం వలన మనిషి జీవితంలోకి చావు ప్రవేశించింది. ఇప్పుడు డబ్బు కూర్చుకోవడం వలన మనిషి చావుకు దగ్గరై పోతున్నాడు. పండు ‘తింటే చస్తావ్’ అని అప్పుడు చెప్పిన దేవుడు, ‘వెఱ్ఱివాడా, యీ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు’ (లూకా 12:20) డబ్బు కూర్చుకుంటే చస్తావ్ అని ఇప్పుడు చెప్తున్నాడు. మనకి డబ్బు కావాలో, ప్రాణము కావాలో తేల్చుకోవాల్సింది మనమే.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# దేవున్ని వెదకండి

మనిషి ఎలా ఉండాలని ఆశించి మనిషిని తన కోసం, తన పోలిక చొప్పున చేసుకున్నాడో అందుకు పూర్తి విరుద్ధంగా మనిషి జీవించాడు. దేవుడు ఈ భూమి మీద మనుష్యులను చేసినందుకు పశ్చాత్తాపపడి, బాధపడేలా మనుష్యులు దేవునికి వ్యతిరేకంగా జీవించారు. 'దేవుడు భూలోకమును చూచి నప్పుడు అది చెడిపోయి యుండెను; భూమి మీద సమస్త శరీరులు తమ మార్గమును చెరిపివేసుకొని యుండిరి' (ఆది. 6:12). బిడ్డలు చెడిపోయి తమ ఇష్టాను సారమైన జీవితం జీవిస్తుంటే వారిని ప్రేమించే తల్లిదండ్రులకు ఎలా ఉంటుంది? బిడ్డలను చూచినప్పుడల్లా ఒక నరకంలా ఉంటుంది. తన స్వహస్తాలతో తన కోసం సృజించుకున్న మనుష్యులు ఈ భూమి మీద చెడిపోయి తమ మార్గము చెరిపివేసుకొని తమ ఇష్టానుసారంగా జీవిస్తుంటే దేవుడు కూడా చాలా బాధ పడ్డాడు. అందుకే భూమి మీద మనుష్యులను చేసినందుకు దేవుడు తన హృదయంలో నొచ్చుకొని వారిని అంతం చేయా లనుకున్నాడు. అప్పుడు నోవహు ఒక్కడే నీతిమంతుడుగా కనిపించాడు. ఎందుకంటే నోవహు దేవున్ని వెదుకుతూ ఆయన మార్గంలో ఉన్నాడు. ఈ భూమ్మీద నోవహు తప్ప దేవున్ని వెదికే వారు ఒక్కరూ కనిపించలేదు. ఈ లోకంలో అనేక మంది దేవునికి దూరమై నానా బాధలతో దిక్కు తెలియని స్థితిలో ఉన్నారు. ధనవంతులు కూడా వారి ధనము వలన సంతృప్తి చెందని స్థితిలో ఉన్నారు. వారికి అన్నీ ఉంటాయి, కానీ ఏదో వెలితి కనిపిస్తుంది. దేవుడు లేని జీవితాలు ఎప్పటికీ వెలితిగానే ఉంటాయి. చాలామందికి దేవుడున్నాడా? అన్న అనుమానం వస్తుంటుంది. కొంతమంది దేవుడెవరు? అని ఆలోచిస్తుం టారు. వారిలో ఇంకొంతమంది దేవుడిని వెదకటం ప్రారంభి స్తారు. ఎవరైతే హృదయపూర్వకంగా దేవుడిని వెదుకు తారో 'నేనే దేవుడను' అని దేవుడు తన్ను తాను వారికి ప్రత్యక్ష పరచుకుంటాడు. అనేకమంది దేవుని పిల్లలు అని చెప్పుకొనే వాళ్ళు కూడా ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ దేవునికి దూరంగానే ఉంటారు. వారే తప్పిపోయిన కుమారుని పోలిన వారు. అతను తనకు కష్టం వచ్చినప్పుడు తన తండ్రిని వెదకుతూ ఎలా వచ్చాడో అలానే ప్రతి ఒక్కరూ దేవున్ని వెద కాలి. కుమారుని కోసం ఆ తండ్రి ఎలా ఎదురు చూస్తున్నాడో, దేవుడు కూడా ప్రతి ఒక్కరికోసం నిరంతరం ఎదురు చూస్తూ మనం ఆయన దగ్గరకు రావాలని నిరీక్షిస్తూ ఉంటాడు. 'తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడచుకొనుచు లోబడ నొల్లని ప్రజలవైపు దినమంతయు నా చేతులు చాపుచున్నాను' (యెషయా 65:2) అని మన వైపే చూస్తూ, మనకోసం నిరీ క్షిస్తున్న ఆయన నిరీక్షణకు అందనంత దూరం వెళ్తే మనం భ్రష్టమనస్సుకు అప్పజెప్పబడతాము. అప్పుడు దేవుడు ఇంక మనకు దొరకడు. అందుకే ఆయన సమీపంగా ఉండగానే ఆయన దగ్గరకు వచ్చి మన జీవితాలను బాగుచేయమని వేడుకోవాలి. మరి నీవు ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ దేవునికి ఎంత దూరంలో ఉన్నావో బేరీజు వేసుకొని, నీ జీవితాన్ని మార్చుకోడానికి నీ కోసం చేతులు చాచి నిరీక్షిస్తున్న దేవుని దగ్గరకు రావడానికి నీవు సిద్ధమా?.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# ప్రభువగు యెహోవాయే నాకు బలము

'బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము, వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు' సామెతలు 22:6. చిన్నతనంలో పిల్లలను దేవునిలో నడిపించకపోతే పెద్దయ్యాక వారు దేవుని భయము లేక ఎలా చెడిపోతారో మనకు తెలుసు. దేవుడు అనే భావనను చిన్నప్పుడే వారి మెదడులోకి ప్రవేశపెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. చిన్నప్పుడు ఎనిమిది సంవత్సరాలు వయస్సున్నప్పుడు మా నాన్న ప్రింటింగ్ ప్రెస్ నడిపించేవాడు. అప్పుడు ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు, రాత్రి 8 గంటలకు కుటుంబ ప్రార్థన పెట్టేవాడు. ప్రార్థనలో సీయోను గీతాలు పాడించేవాడు నాన్న. చాలా ఆత్మీయంగా ఉండేవి. క్రైస్తవ కుటుంబంలో పుట్టినప్పటికీ నాన్న కుటుంబ ప్రార్థన పెట్టక పోయి ఉంటే దేవునితో ఆత్మీయ అనుబంధం ఏర్పడక నామకార్థ క్రైస్తవునిగా మిగిలిపోయే వాడిని. నా ఆత్మీయ జీవితానికి మా ఇంట్లో జరిగిన కుటుంబ ప్రార్థన ఒక పునాదిలా ఏర్పడింది. బయటి వారితో నాన్న వ్యవహరించే తీరు, మాట్లాడే విధానం ఒక విశ్వాసిని కనుపరచేవి.

1994లో నేను నాన్నకి ఆఫీసులో సహాయపడేటప్పుడు దేవుని పని చేయడానికి చాలా ప్రోత్సాహించేవాడు. నేను ఆర్టిస్ట్‌ని కావడం వలన గోడల మీద దేవునివాక్యం రాయించే వాడు. కరపత్రాలు తెప్పించి నన్ను పంచమని చెప్పేవాడు. ఒంగోలు రైల్వేస్టేషన్‌లో రోజూ ఉదయం 5 గం॥కు రెండు ప్యాసింజర్ రైళ్ళు ఒకటి విజయవాడకి, ఇంకోటి తిరుపతికి బయలుదేరేవి. నేను ఉదయాన్నే నాలుగున్నరకే వెళ్ళి రెండు రైళ్ళలో ప్రతి సీటు మీద 'నీ ప్రయాణం ఎటువైపు' అనే కరపత్రికను పెట్టి వచ్చే వాడిని. అలా చాలాకాలం చేశాను.

నాకు దేవుని పని చేయాలనే కోరిక బలంగా రావడానికి నాన్న ప్రోత్సాహం కూడా తోడయ్యింది. కుటుంబ పోషణ విషయంలో కానీ, పిల్లల చదువుల విషయంలో కానీ, పరిచర్య విషయంలో కానీ దేవుని మీద ఆధారపడటం నేర్చుకున్నాను. ఎప్పుడైతే నేను ప్రతి చిన్న విషయానికి దేవుని మీద ఆధారపడటం ప్రారంభించానో, విశ్వాసంలో ఎదగటానికి నాకు చాలా బలం చేకూరింది. సుమారు 20 లక్షల మంది ఇశ్రాయేలీయులని 40 సంవత్సరాలు పోషించిన దేవుడు నా కుటుంబాన్ని పోషించలేడా అనే ధైర్యంతోనే ముందుకు సాగాను. ఏ విషయంలో కూడా నేను మనుష్యులను ఆశ్రయించలేదు. ఎందుకంటే నా ప్రతి అవసరాన్ని, నా ప్రతి సమస్యను **"చూచుచున్న దేవుడు"** చూస్తున్నాడు. కాబట్టి నా అవసరం, నా సమస్య తీరకపోతే అది దేవుని చిత్తము కాదు అనుకొనే వాడిని.

2004 నుండి సండేస్కూలు పరిచర్యలో ఉన్నప్పుడు ఆదివారం, రెండవ శనివారము కాకుండా పిల్లలకి స్కూల్ సెలవు వచ్చినప్పుడు కూడా వెళ్ళేవాడిని. పిల్లలకి దసరా, సంక్రాంతికి ఎక్కువ రోజులు సెలవులు వచ్చినప్పుడు ఒక్కో గ్రామంలో ఒకరోజంతా ఉండి వి.బి.యస్.లాగా నడిపించే వాడిని. ఇవి కాకుండా మిగతా రోజుల్లో నేను టైపు చేసిన బైబిల్‌ని ఇంటర్నెట్‌లో పెట్టడానికి అవసరమైన ఫైల్స్ తయారు చేసుకొనే వాడిని. అన్నీ సిద్ధం చేసుకున్నాక 2010లో www.onlinetelugubible.net అనే డొమైన్ నేమ్ తీసుకొని, నేను తయారు చేసుకున్న బైబిల్ ఫైల్స్ అన్నీ ఇంటర్నెట్‌లోకి అప్‌లోడ్ చేసేవాడిని. నాకు వెబ్ డిజైనింగ్ రాకపోయినప్పటికీ, బుక్స్ చదివి, ఇంటర్నెట్‌లో చూసి నేర్చుకొని స్వంతంగానే వెబ్‌సైట్ తయారు చేశాను. నా వెబ్‌సైట్‌లో నేను టైపు చేసిన బైబిలే కాకుండా, తెలుగు-ఇంగ్లీషు ప్యారెలల్ బైబిల్, ఆడియో బైబిల్, ఆంధ్రక్రైస్తవ కీర్తనలు, సీయోను గీతాలు, బైబిల్ ఎన్‌సైక్లోపీడియా ఇలా క్రైస్తవులకు ఉపయోగపడేవి చాలా ఉంచాను. ఇవి చేస్తూనే ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుండి SMS ద్వారా సుమారు పదివేలమందికి పైగా దేవుని వాక్యము పంపించే వాడిని. అంతేకాక SMS ద్వారా బైబిల్ క్విజ్ నిర్వహించి ఫస్ట్ వచ్చిన వారికి బైబిల్స్ ఇచ్చేవాడిని. నేను ఉదయం నిద్రలేవగానే దేవుని పనితోనే నా దినచర్య ప్రారంభ

మయ్యేది. దేవుడు నాకిచ్చిన ఆరోగ్యము, తెలివితేటలు దేవుని పనికి ఉపయోగించాలనేది నా బలమైన కోరిక.

2005లో ఆస్ట్రేలియా నుండి డేనియల్ స్కాట్ అనే ఆయన ఒంగోలు వచ్చాడు. ఆయన అమెరికాలో 'లైఫ్ వే ఇంటర్నేషనల్' అనే లిటరేచర్ సంస్థలో డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఆయన పరిచర్యలో భాగంగా మా అంకుల్ సహకారంతో ఒంగోలులో ఒక మీటింగు పెట్టడానికి వచ్చాడు. ఆ పని అంకుల్ నాకు అప్పగించాడు. ఆ మీటింగు ప్రారంభించడానికి ముందు డేనియల్‌స్కాట్‌గారు ఎందుకో తెలియదు గానీ, నన్ను తీక్షణంగా చూస్తూ నా దగ్గరకు వచ్చి, నీ కళ్ళలో వెలుగు కనబడుతుంది నాకు, దేవుడు నిన్ను గొప్పగా వాడుకుంటాడు అని చెప్పాడు. వెంటనే నాకు రెండున్నర సంవత్సరాల క్రితం (2002) YWAM (యూత్ విత్ ఏ మిషన్)లో గెస్ట్ లెక్చరర్స్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అక్కడ కూడా ఇలానే చెప్పారు. మీటింగ్ అయిపోయాక ఇంటికి వచ్చినప్పుడు డేనియల్‌స్కాట్‌గారు బేసిన్‌లో నీళ్ళు తెప్పించి నా కాళ్ళు కడిగారు. ఆయన అలా చెయ్యడం నాకు ఏ మాత్రం ఇష్టంలేక ఎంత వారించినా ఆయన ఒప్పుకోలేదు. అందుకే నేను కూడా ఆయన కాళ్ళు కడిగాను.

ఆ రాత్రి నేను చాలా ఆలోచించాను. ఇంతమంది ఇలా చెప్తున్నారు కదా, దేవుడు నన్ను ఎలా వాడుకోబోతున్నాడో నాకు తెలియదు. నేను సండేస్కూలు పరిచర్య ప్రారంభించి సంవత్సరం కూడా కాలేదు. నాకైతే డబ్బుతో దేవుని సేవ చేయడం అస్సలు ఇష్టం లేదు. అంటే ఎవరైనా డబ్బులు ఇస్తే గొప్ప సేవ చేయడం, సూటు బూటు వేసుకొని, కార్లలో తిరుగుతూ, గొప్ప పేరు సంపాదించుకొనే సేవ చేయడం ద్వారా దేవుని నామం ఘనపరచబడుతుందని నేననుకోను. అందుకు తగ్గట్టుగానే 20 సంవత్సరాల నా దేవుని పరిచర్యలో ఎవ్వరినీ ఒక్క పైసా చందా అడగలేదు. ఒకవేళ దేవుని ప్రేరేపణతో ఎవరైనా చందా ఇచ్చినా అవి పూర్తిగా దేవుని పనికే ఉపయోగిస్తాను తప్ప నాకోసం ఉపయోగించుకోను. నా దగ్గర ఉన్నంత వరకు, నేను చేయగలినంత వరకు వ్యక్తిగతంగానే దేవుని పని చేస్తాను.


## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | జప్పత్పనేహు | రూ. 45 |
| 3. | ఆసెనతు | రూ. 150 |
| 4. | అపొస్తలుడు | రూ. 60 |
| 5. | బర్నబా | రూ. 30 |
| 6. | తిమోతి | రూ. 40 |
| 7. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 8. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 11. | తోటలో పనివాడు | రూ. 20 |
| 12. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 13. | నా కుటుంబము | రూ. 25 |
| 14. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 15. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 16. | నా స్నేహితుడు | రూ. 50 |
| 17. | అంత్యదినములలోని యదార్థ ప్రవక్త | రూ. 50 |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 22. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 23. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 24. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 25. | జీవనమంతయు | రూ. 40 |
| 26. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 27. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 28. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 29. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 30. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 31. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 32. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 33. | హదస్సా | రూ. 70 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లొపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# దేవుడిచ్చిన పరిచర్య

2003లో నేను దేవుని పని తప్ప ఇంకే పని చేయ కూడదు అని నియమం పెట్టుకున్న తర్వాత, కుటుంబ పోషణ కొరకు నేను వేరే ఏ పని చేయలేదు. 2004 నుండి 2011 వరకు సండేస్కూలు పరిచర్య నిమిత్తం గ్రామాలకు వెళ్తూనే ఉన్నాను. ఏ ఒక్క ఆదివారము, ఎలాంటి పరిస్థితుల్లో కూడా నేను ఇంటి దగ్గర లేను. ఎండైనా, వానైనా, చలి అయినా నేను సండేస్కూలు మానలేదు. పరచర్యలో నాకు నేనుగా పెట్టుకున్న నియమం ప్రకారం, ఏ ఒక్క ఆదివారము పరిచర్య మానకూడదు, పరిచర్యలో ఎక్కడా కూడా ఒక్క నయాపైసా కూడా డబ్బులు తీసుకోకూడదు అన్న దానికి కట్టుబడి ఉన్నాను. నేను వెళ్ళే సంఘములలోని సంఘకాప రులు సండేస్కూలు పిల్లలు వేసిన చందాను నన్నే తీసుకోమని చేప్పేవాళ్ళు. నేను వద్దు అని చెప్పినప్పుడు, పర్లేదు తీసు కోండి చాలా దూరం నుండి వచ్చారు, పెట్రోలుకి, ఖర్చులకి ఉంటాయని బలవంతం చేసేవాళ్ళు. వాళ్ళు ఎంత బలవంత పెట్టినా, కావాలంటే రావడం మానేస్తాము కాని చందా తీసుకోము అని మొహం మీదనే చెప్పేవాడిని. ఎందుకంటే సాతాను చాలా తెలివిగా మనుష్య లను దేవుని నుండి దూరం చేస్తుంది. దేవుని పని చేసేవాళ్ళు చందాలు తీసుకోవడం తప్పు, పాపము కాక పోవచ్చు కానీ, అలా చందాలు తీసుకోవడానికి అలవాటు పడితే, దేవుని మీద ఆధారపడాల్సిన అవసరం లేకపోవడం వలన దేవునికి దూరమైపోతారు. నాకు తెలిసిన ఎంతోమంది దేవుని సేవకులు సంఘకాపరులే కానీ, సువార్తికులే కానీ, దేవుని సేవకు వచ్చిన ప్రారంభంలో ఉన్న విశ్వాసము, చందాల ద్వారా సమకూడిన ధనము వలన సన్నగిల్లి దేవునికి దూరమై పోయారు. చందాలు తీసుకోవడమన్నది ఒక 'స్లో పాయిజన్' లాంటిది. అది మనిషిలోని విశ్వాసాన్ని పూర్తిగా చంపేస్తుంది.

దేవుని పని చెయ్యాలి అనుకొనే వారు ఏ ఉద్దేశ్యంతో చేస్తున్నారు అనే దానినిబట్టి వారి విశ్వాస జీవితం ఆధారపడి ఉంటుంది. దేవుని పని చేస్తే దేవుడు గొప్పగా ఆశీర్వదిస్తాడు, మంచి పేరుప్రఖ్యాతులు ఇస్తాడు, తలగా ఉంచుతాడేగానీ తోకగా ఉంచదు, కొండమీద ఉండే పట్టణంలా ఉంచుతాడు. ఎలాంటి కష్టం లేకుండా సుఖవంతమైన జీవితం ఇస్తాడు, ఉండటానికి మంచి ఇల్లు, కారు ఇస్తాడు అని భావించి దేవుని సేవలోకి వస్తే, వారి ఆలోచనా విధానామంతా వారు అనుకొనే 'ఆశీర్వాదము' చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. వారికి వచ్చే చందాలన్నీ దేవుని ఆశీర్వాదము వలన వచ్చినవి కాబట్టి, ఆ డబ్బంతా వారి కోసమే ఖర్చు చేసుకుంటారు. ఎందుకంటే వారు చేస్తున్న "దేవుని సేవ" ఫలితం అని భావిస్తారు. మరైతే ఉద్యోగము, వ్యాపారము చేసేవారికి, దేవుని సేవ చేసేవారికి తేడా ఏముంటుంది? ఉద్యోగము, వ్యాపారము చేసేవారి ఆలోచన, దేవుని సేవ చేసేవారి ఆలోచన ఒకేలా ఉన్నప్పుడు దేవుని సేవ చేసేవారి ప్రత్యేకత ఏముంటుంది?

దేవుని పని చేయడం వేరు, దేవుని మీద ఆధారపడటం వేరు. ఎవరైనా నెల జీతం ఇచ్చి దేవుని పని చెయ్యమంటే అది ఉద్యోగము అవుతుందే తప్ప సేవ కాదు. దేవుని సేవ చేస్తున్నామని చెప్పి, పోషణ కొరకు జీతము ద్వారానో, చందాల ద్వారానో మనుష్యుల మీద ఆధారపడితే ఇంక దేవునితో మనకు ఎలాంటి అవసరం ఉండదు. మత్తయి 6వ అధ్యాయంలో యేసుప్రభువు నేర్పించిన ప్రార్థనలో 'మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము' అని చెప్పిన ప్రకారము మన పోషణ కొరకు ప్రతిరోజూ దేవుని మీద ఆధారపడినప్పుడు దేవునితో మనకున్న సంబంధం బలపడు తుంది. రోజూ కూలికి పనిచేసేవారు తమ కూలి కోసం ప్రతిరోజూ యజమాని దగ్గరకు వెళ్తారు కదా! అదే నెల జీతానికి పని చేసేవాళ్ళు నెలకు ఒక్కసారి మాత్రమే యజమాని దగ్గరకు వెళ్తారు. నేను, నా ప్రతి అవసరం దేవుని ద్వారా తీరాలని కోరుకుంటాను.

ఎట్టి పరిస్థితుల్లో కూడా ఏ ఒక్క ఆదివారము పరిచర్య మానకూడదు అని నాకు నేను పెట్టుకున్న నియమాన్ని కూడా చాలా కఠినంగానే పాటించాను. విపరీతమైన ఎండలో కూడా ఎక్కడా రెస్టు తీసుకోకుండా గ్రామాలకు వెళ్ళినప్పుడు

పాస్టర్లు ఆశ్చర్యపోయే వాళ్ళు, ఇంత ఎండలో వచ్చారా అని. అలాగే ఎంత పెద్ద వర్షం వచ్చినా, ఎక్కడా ఆగకుండా తడుచుకుంటూనే వెళ్ళే వాడిని. అలా వెళ్ళడంలో నా ఉద్దేశ్యం ఎంత ఎండైనా, వానైనా సండేస్కూలు ఆగదు అని పిల్లలు భావించాలని. ఒకసారి నవంబరు నెలలో ఒక ఆదివారం తుఫాను ఉందని హెచ్చరించారు. అయినా కూడా నేను వెళ్ళడానికే సిద్ధపడ్డాను. ఇంట్లో వాళ్ళు వెళ్ళవద్దని బ్రతిమిలాడారు. నేను వెళ్ళాల్సిన ఊరు 20 కి.మీ. దూరం ఉంటుంది. పెద్ద గాలివానలోనే బైక్ మీద వెళ్ళాను. నేను అక్కడ సండేస్కూల్ పెట్టే చోటుకి వెళ్ళినప్పుడు ఆశ్చర్యంగా అంత వానలోనూ పిల్లలు అక్కడ ఉన్నారు. వానకి నా సెల్‌ఫోన్ తడిచి పాడైపోయినా, నా కష్టం వృధా పోనందుకు చాలా సంతోషించాను.

ఒక్కోసారి తీవ్రమైన ఎండలో వెళ్ళేటప్పుడు వడగాలి వేడిగా ముఖానికి తగులుతుంటే వడదెబ్బ తగిలి చని పోతానేమో అనిపించేది. దేవుని కోసం కష్టపడుతున్నందుకు గర్వంగా ఫీలయ్యేవాడిని. చాలామంది ఉద్యోగరీత్యా, వ్యాపార రీత్యా ఎండైనా, వానైనా ఎంతో దూరం ప్రయాణం చేస్తుం టారు. వాళ్ళ అవసరాల దృష్ట్యా వాళ్ళకి తప్పక పోవచ్చు. ఒకవేళ నేను ఆ పరిస్థితుల్లో ఉంటే చచ్చినట్లు చేసే వాడిని కదా! కాకపోతే ఇప్పుడు హృదయపూర్వకంగా, ఇష్టంగా దేవుని పని చేస్తున్నాను అని అనుకొనేవాడిని. నా పరిధిలో మానసికంగా, శారీరకంగా నేను చేయగలిగినంత వరకు నిజాయితిగా చేయగలుగుతున్నాను. యేసుప్రభువు శిష్యులు కానీ, అపొస్తలుడైన పౌలు కానీ, బర్నబా, తిమోతి, స్తెఫెను ఇంకా ఆదిమ సంఘములోని అనేకమంది దేవుని సేవపట్ల ఎలాంటి నిబద్ధత కలిగి ఉన్నారో, అందులో ఒక్క పది శాతమైనా నేను చేయగలుగుతున్నానా?

అపొస్తలుడైన పౌలు దేవుని కోసం ఎన్నో శ్రమలు పడ్డాడు. 2కొరింథీ. 11:23-27లో పౌలు తాను అనుభవిం చిన శ్రమలను గురించి చెప్తూ "మరి విశేషముగా ప్రయాస పడితిని, మరి అనేక పర్యాయములు చెరసాలలో ఉంటిని; అపరిమితముగా దెబ్బలు తింటిని, అనేకమారులు ప్రాణాపా యములలో ఉంటిని. యూదులచేత అయిదుమారులు ఒకటి తక్కువ నలువది దెబ్బలు తింటిని; ముమ్మారు బెత్తములతో కొట్టబడి తిని; ఒకసారి రాళ్లతో కొట్టబడితిని; ముమ్మారు ఓడ పగిలి శ్రమపడితిని; ఒక రాత్రింబగళ్లు సముద్రములో గడిపితిని. అనేక పర్యాయములు ప్రయాణ ములలోను, నదులవలననైన ఆపదలలోను, దొంగలవలన నైన ఆపదల లోను, నా స్వజనులవలననైన ఆపదలలోను, అన్యజనుల వలననైన ఆపదలలోను, పట్టణములో ఆపదలలోను, అరణ్య ములో ఆపదలలోను, సముద్రములో ఆపదలలోను, కపట సహోదరులవలని ఆపదలలోను ఉంటిని. ప్రయాసతోను, కష్టములతోను, తరచుగా జాగర ణములతోను, ఆకలిదప్పుల తోను, తరచుగా ఉపవాసము లతోను, చలితోను, దిగంబర త్వముతోను ఉంటిని, ఇంకను చెప్పవలసినవి అనేకము లున్నవి" అని తాను అనుభవించిన శ్రమలు ఒక పెద్ద లిస్టు చెప్పాడు.

అలాంటి శ్రమలలో కనీసం ఒకటి కూడా నేను ఎదుర్కోలేదు. నేనే కాదు ఈ రోజుల్లో ఏ దైవసేవకుడు కూడా పౌలు ఎదుర్కొన్నటువంటి శ్రమలు ఎదుర్కోడానికి సిద్ధంగా లేరు. ఈ రోజుల్లో దేవుని పరిచర్య అంటే లాభసాటిగా ఉంది. డబ్బు లేనిదే దేవుని సేవ జరగని స్థితిలోకి దేవుని సేవ నెట్టబడింది.

**చందాదారుల వివరములు**

1. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
2. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000 (నెలకు)
3. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
4. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
5. జి. కళావతి, ఒంగోలు 350/-
6. వి. కస్తూరి, భీమవరం 500/-
7. జయ, గుంటూరు - 1500/-
8. కె. రజిని, నరసరావుపేట - 1000/-
9. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
10. శ్రీమతి కె. కల్పన, గోవా - 350/-
11. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
12. శ్రీమతి సి. హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట - 350/-
13. కె. రాజేష్, రాజమండ్రి - 350/-
14. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-

సాక్ష్యము

# నమ్మదగిన దేవుడు

నా పేరు విజయలక్ష్మీ. మాది పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు తాలూకా సమీపానగల సోమవరప్పాడు గ్రామంలో ఒక హిందూ కుటుంబంలో జన్మించాను. మాది ఉన్నతమైన (కమ్మ) కుటుంబం. తండ్రి దేవినేని వీరరాఘవయ్య, తల్లి విమలాదేవి. ముగ్గురు అన్నలు, ఒక అక్క, చెల్లి ఉన్నారు. కుమార్తెలలో నేను రెండవదానను. మా అమ్మ మొదటి నుండి హిందూ సాంప్రదాయకమైన పూజలు నోములు, తీర్థయాత్రలు చేయుటలో ఎంతో భక్తిగా ఉండేవారు. ఆ గ్రామములోనే మా తాతగారు ఒక గుడి కట్టించి, పూజారుల ద్వారా పూజలు జరిగించేవారు. అప్పటికి ఇంకా యేసుక్రీస్తు గూర్చి మేము వినియుండలేదు. ఒకసారి మా అక్కగారు బహు తీవ్రముగా జబ్బుపడిరి. ఎన్ని మందులు వాడినా, ఎన్ని పూజలు చేసినా బాగుకాలేదు. ఆ సమయంలో వరి కోతలకు కూలీలు మా గ్రామం వచ్చారు. వారిలో కొందరు మా ఇంటి ఆవరణంలో ఉన్నారు. వారు పొలంలో పని ముగించి వచ్చాక రాత్రిపూట యేసుక్రీస్తు పాటలు పాడుకొని ప్రార్థన చేసుకొనేవారు. వారి పాటలు ప్రార్థనలు మా అమ్మ వింటుండేది. కోతలు అయిపోయాక కూలీలు వారి గ్రామాలకు వెళ్ళిపోయారు. ఇట్లుండగా ఏలూరులో లంకపేట అను స్థలంలో ఇద్దరు భార్యాభర్తలు సేవచేయు చుండిరి. ఒకరోజు మా గ్రామానికి సేవకు వెళ్ళమని దేవుడు వారిని ప్రేరేపించగా కొంతమంది కలిసి పాటలు పాడుచు, వాక్యం చెప్తూ 'పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు ఈ లోకమునకు వచ్చెను. ఆయన గొప్ప దేవుడు, మాట్లాడే దేవుడు, రోగులను స్వస్థపరుచు దేవుడు' అని ప్రకటిస్తుండగా మా తల్లి విని, వారిని ఆహ్వానించి దేవుని మాటలు చెప్పించు కొనిరి. వాక్యము చెప్పిన తర్వాత తమ మందిరానికి రమ్మని అడ్రస్ ఇచ్చి వెళ్ళిపోయారు. మా అమ్మ మా నాన్నకి తెలియకుండా వారి మందిరానికి వెళ్తుండేది. దేవుని వాక్యాన్ని బట్టి ప్రభువును గూర్చిన మాటలు విని, ఆయనయందు విశ్వాసముంచి తన పాపక్షమాపణకై ప్రార్థించెను. ఒకరోజు ప్రభువు తన పాపములు కడిగినట్లు ఆమెకు దర్శనం కలిగెను. ఈ విధంగా ఆమె రక్షింపబడి ప్రతిరోజు వాక్యం చదువుచు, ప్రార్థిస్తుండేది. కొంత కాలానికి మా నాన్నగారికి తెలిసి మందిరానికి వెళ్ళకుండా ఆటంకపరుస్తున్నాడు. ఎందుకంటే మా గ్రామంలోగాని, మా బంధువర్గంలోగాని యేసుప్రభువును విశ్వసించిన వారెవరూ లేరు. మా గ్రామానికి మా నాన్నే పెద్ద గనుక మా ఔన్నత్యమునుబట్టి మత మార్పిడి కుటుంబమునకు అవమానకరమని భావించారు. మా అమ్మమాత్రం కన్నీటితో ప్రభువుని ప్రార్థించేది. అయితే మా గ్రామస్తులు, బంధువులు చాలా అవమానంగా మాట్లాడేవారు. గ్రామస్తులు మమ్మల్ని వెలివేయవలెనని ప్రయత్నములు చేస్తున్నారు. అయితే మా అమ్మ కన్నీటితోను, ఉపవాసతోను, పట్టుదలతోను ప్రార్థించుచుండెను. ప్రభువు యొక్క ఉచిత కృపనుబట్టి ఆమె ప్రార్థనల వలన వెలివేయువారి చేతినుండి వారి ప్రయత్నాల నుండి ప్రభువు మమ్ములను తప్పించాడు. దీనికి ముందు ఒక సంఘటన జరిగింది. మేము పూజా కార్యక్రమాలు జరిపే ఒక ప్రత్యేకమైన గది ఉండేది. మా అమ్మ ప్రభువుని నమ్మిన తర్వాత ఆ గదిని ప్రార్థనా గదిగా మార్చుకొని ప్రార్థిస్తున్నాము. నెమ్మదిగా ఆ గదిలోని పూజా విగ్రహములను తీసివేస్తుండగా మా నాన్న గమనించి మా అమ్మని ఎంతో బాధించారు. అయితే మేము ప్రభువునందు వెనుక తీయక ఆయన మీదనే భారంవేసి విశ్వాసంతో, పట్టుదలతో ఆ పని చేయగలిగాం. ఈ విధంగా ఎన్ని శ్రమలు వచ్చినా విడువక ప్రార్థించు సమయంలో విజయవాడలో ప్రత్యేక కూడికలు జరుగుచున్నట్లు తెలిసి ఆ కూడికలకు మా అమ్మ వెళ్ళవలెనని ఆశించింది. అందుకు మా నాన్న అనుమతి అవసరం కనుక మా నాన్న మనసు మారి ఆ కూడికలకు పంపునట్లు దేవుని ప్రార్థించింది. ఆ ప్రార్థన ఫలితంగా మా నాన్న కూడ మా అమ్మతో కలసి ఆ ప్రత్యేక కూడికలకు వెళ్ళిరి. దేవునికి స్తోత్రములు. మా నాన్న అక్కడ వాక్యము విని మారుమనస్సు పొంది ఒక బైబిలు కొని, చదువుట, ప్రార్థించుట ప్రారంభించెను. అంతకుముందు ఆయన వేదగ్రంథం చదివేవాడు, ఇప్పుడు బైబిలు చదువుట ద్వారా వేదాలకు బైబిలుకు మధ్యగల వ్యత్యాసం గ్రహించ గల్గిరి. ఇట్లుండగా మా గ్రామంలో కీళ్ళవాతం అను వ్యాధి

అనేకమందికి సోకినది. ఆ వ్యాధి మాచెల్లికి కూడ రాగా ఏ ఆసుపత్రికి వెళ్ళకుండా మా అమ్మే నూనెరాసి ప్రార్థించగా ప్రభువు మా చెల్లిని స్వస్థపరచెను. మా గ్రామము కొరకు రక్షణలేని బిడ్డల కొరకు ప్రార్థించగా కొంతమంది రక్షించ బడిరి. ఈ విధంగా మా అమ్మ దేవుని కొరకు వాడబడుచు అప్పుడప్పుడు నన్ను కూడ హెచ్చరిస్తుండేది. కాని నేను లోబడక భజనలు, పూజలు చేయటం, బంధువులతో కలసి సినిమాలకు వెళ్ళుట, ముగ్గులు వేయుట, బొట్టుపెట్టు కోవటం మొ॥న అన్యాచారాలలోనే ఉంటిని. నా కోసం మా అమ్మ పట్టుదలతో ప్రార్థిస్తుంది. ఒకరోజు మా అమ్మ 'నీవు నేను ఈ లోకములో ఒకే ఇంటిలో సంతోషంగా ఏలాగు కలిసి ఉంటున్నామో అలాగే పరలోకంలో కూడ కలిసి ఉండాలని నా ఆశ. అందుకు నీవు ప్రభువుని నమ్మికోవాలి. నేనునమ్మిన దేవుడు గొప్పవాడు. నాకు శాంతి సమాధానములు ఇచ్చాడు. ఆయన ఆశ్చర్యకరుడు. నీవు కూడ నీ పాపాలను ఒప్పుకుంటే పరలోకములో శాంతి సమాధానాలతో నాతో కూడ ఉంటావు' అని నన్ను హెచ్చరించింది. అందుకు నేను 'అమ్మా! నేను ఏ పాపం చేయలేదు కదా!' అని బదులిచ్చాను. 'జన్మ, కర్మ పాపాలను గూర్చి అబద్ధములు, అవిధేయత, దొంగతనం, గర్వము, దేవుని మాట వినకపోవుట ఇవన్నీ పాపాలే' అని చెప్పింది. అప్పుడు నాలో భయం కలిగి 'నీవు ఉండుచోటనే నేను కూడ ఉంటాను, యేసుప్రభుని నమ్ముకుంటాను' అని చెప్పి అప్పటి నుండి అమ్మతో మందిరమునకు వెళ్తున్నాను. అక్కడ ఉన్న దైవసేవకుని కుటుంబం నన్ను దేవుని గూర్చిన మాటలతో హెచ్చరించుచుండెను. ఒకరోజు దైవ సేవకుని కుమార్తె నీవు మారుమనస్సు పొందావా? నీ పాపములు క్షమించబడ్డాయా? అని ప్రశ్నించగా, నేను మారుమనస్సు "ఏమిటి? పాపక్షమాపణ ఏమిటి? వాటిని గూర్చి నాకు ఏమి తెలియదు అన్నాను. నాకు ప్రార్థన చేయుట రాదు గనుక నాకు ఏలాగు ప్రార్థించవలెనో నేర్పమని కోరాను. అప్పట్నుండి మందిరానికి వెళ్తు సేవకుని కుమార్తెతో కలిసి ప్రార్థించేవారము.

ఒకరోజు నా పాపాలు చూపించి నాతో మాట్లాడు ప్రభువా అని ఇద్దరం కలిసి ఉపవాసంతో, పట్టుదలతో మూడు రోజులు ప్రార్థించాము. మూడవరోజు రాత్రి ప్రభువు నన్ను దర్శించాడు. ఒక వ్యక్తి తెల్లని వస్త్రాలు ధరించి ప్రకాశ మైన వెలుగుతో ఒకచేతిలో క్రొవ్వత్తి పట్టుకొని నావైపు వచ్చు చుండెను. నేను ఆ వెలుగును చూడలేక కళ్ళు మూసుకు న్నాను. ఆ వ్యక్తి ఆ క్రొవ్వత్తిని నాకు చూపిస్తూ 'అమ్మా! చూడు ఇది ఏ విధంగా ప్రకాశిస్తుందో నీవు కూడా నా కొరకు ఆ రీతిగా ప్రకాశించాలి' అని నాతో చెప్పెను. నేను కళ్ళు తెరచి చూస్తే ఎవరూలేరు. ఈ విషయం దైవ సేవకు నితో చెప్పగా వారు మత్తయి 5:14-16 చదివి వివరిస్తూ 'నీవు అన్యజనుల మధ్య వెలుగుగాను, సాక్షిగాను ఉండాలని నిన్ను కోరి ప్రభువు ఆ దర్శనం నీకు ఇచ్చాడు' అని చెప్పాడు. ఇంతకుముందెప్పుడు ఆ స్వరం నేను వినలేదు. మొదటిగా నేను వినిన దేవుని స్వరం ఇదే. అప్పట్నుండి నేను ప్రతిరోజు ప్రార్థన చేసుకుంటూ నూతన జీవితం జీవిస్తున్నాను.

ఒకసారి నాకు న్యూమోనియ జ్వరము రాగా మేము ప్రార్థించగా ప్రభువు నన్ను స్వస్థపరిచాడు. ప్రభువు సేవ చేయాలని నేను ఆశ కలిగియున్నాను. మా బంధువులు మమ్మును నిందిస్తూ, అవమానిస్తున్నారు. నేను మా అమ్మ ఇద్దరం దేవుని సన్నిధిలో కన్నీటితో ఉపవాస ప్రార్థన చేయగా దేవుడు మాకు మత్తయి 5:11,12 వచనములను చూపించి మమ్మును ధైర్యపరిచాడు. ఇలా ఉండగా నా పెళ్ళి విషయంలో చాలా సమస్యలు తలెత్తాయి. మా నాన్న నన్ను మా బంధువులకు ఇవ్వాలని, మా అమ్మ దేవుని నమ్మిన విశ్వాసికి ఇవ్వాలని ఒకరికొకరు పట్టుదల కలిగియుండిరి. మా బంధువులంతా నన్ను, మా అమ్మను చుట్టుముట్టి 'మన కులంలో ఉన్నవారినే వివాహం చేసికోవాలి గాని ఇతర కులస్థులను చేసుకోడానికి వీల్లేదు, మేము ఒప్పుకోమని చాలా అవమానంగా మాట్లాడారు. మా బంధువులలో ఒక సంబంధం తీసుకొచ్చి ఒప్పుకోమని, తిరుపతిలో వివాహం చేస్తామని అర్ధరాత్రి వరకు మమ్ములను బాధించి, బలవంతం చేశారుగాని మేమేమి మాట్లాడలేదు. మేము మాట్లాడితే వారు మమ్ములను కొట్టుటకు కూడ సిద్ధంగా ఉన్నారు. అయిప్పటికీ నేను ధైర్యం చేసి ఆ వివాహం నాకొద్దని చెప్పగా మా తాత నన్ను కొట్టి అవమానకరంగా మాట్లాడాడు. అప్పట్నుండి ప్రార్ధనకు వెళ్ళకుండా మా నాన్న మమ్మల్ని ఇంట్లోనే బంధించాడు. సేవకులను కూడ ఇంటికి రానివ్వలేదు.

ఇంట్లో కఠినమైన పోరాటాలు మొదలైనాయి. అయినా

ఒక విశ్వాసిని ఉద్యోగమున్నా, లేకపోయినా వివాహం చేసికోవాలని ఆశించాను. ఒకవేళ అన్యులను వివాహమాడితే తిరిగి అన్యాచారాలు చేయాల్సుంటుంది గనుక దాని ఫలితం నరకమేనని అన్యుని వివాహం చేసుకోకూడదని నిశ్చయించు కున్నాను. ఫలితంగా బంధువులు, ఇతరుల ద్వారా అనేక మైన ఇబ్బందులు కలుగుచుండగా, హృదయవేదనతో మా ఆవరణంలోని బావిలో దూకాలని నిలబడ్డాను. వెంటనే 'బావిలో పడి చనిపోతే నీవు నా దగ్గరకు రాగలవా?' అన్న దేవుని స్వరం నాకు వినబడగా నేను చనిపోతే దేవుని దగ్గరకు వెళ్ళను గదా అని తలంచి, ప్రభువు నా కొరకు ఎన్నో శ్రమలు, అవమానాలు భరించాడు కదా! అలాగే ఎన్ని శ్రమలు వచ్చినా నేను దేవుని కొరకు నిలబడాలని తీర్మానం చేసుకున్నాను. అప్పట్నుండి వివాహానికి తగిన విశ్వాసిని జతపరచమని కన్నీటితో ప్రార్థించేదానను ఇట్టి వేదనకరమైన పరిస్థితులలో 'దేవా, నాతో మాట్లాడవా' అని ప్రార్థించి ఆ రాత్రి నిద్రపోయాను. అప్పుడు ప్రభువు సమూయేలును పిలిచినట్లు 'విజయా' అని నన్ను పేరుపెట్టి పిలిచి ధైర్యపరచెను. ఈ విధంగా అనేకసార్లు వాక్యం ద్వారా, స్వరం ద్వారా, దర్శనాల ద్వారా మాట్లాడుతూ నన్ను ధైర్యపరిచాడు.

ఒంగోలు సమీపంలోని అన్నంగి అను గ్రామంలో సాధినేని వీరాస్వామి, చెంచమ్మ అను దంపతులకు బిడ్డలు కలిగి చనిపోవుచుండగా, కొండకు పోయి మ్రొక్కుబడి చేసికొని తమకు కలిగిన ఆఖరి కుమారునికి 'యానాది' అని పేరు పెట్టుకొనిరి. అతను ఒంగోలులో చదువుచుండగా సహో. కోటేశ్వరరావు, ప్రేమయ్యగార్ల ద్వారా దేవుని వాక్యం విని మారుమస్సు పొందిరి. కొంతకాలమునకు భక్తసింగ్ గారి ద్వారా బాప్తిస్మం పొంది 'టైటస్' అను పేరుతో దేవుని మందిర పరిచర్యలో పాలు పొందుచు, మరొకవైపు టీచర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఒంగోలులో వీరు, వీరి కుటుంబం వివాహ విషయమై ప్రార్థిస్తున్నారు.

మా ప్రార్థన, వీరి ప్రార్థన దేవుడు ఆలకించి తన సంకల్పాన్నిబట్టి తన బిడ్డల ద్వారా ఈ సంబంధమును గూర్చి మాకు తెలియపరచెను. మా నాన్న ఒంగోలులోని మందిరానికి వచ్చి, సేవకులు యోహాను, కోటేశ్వరరావు, ప్రేమయ్యగార్లను సంప్రదించి భక్తసింగ్ గారి ద్వారా మా స్వగృహమునందు మా వివాహం జరిపించారు. వివాహానికి వచ్చిన మా బంధువులందరు ఎంతో అవమానకరంగా మాట్లాడారు. అవి మాకు ఆశీర్వాదాలుగానే తలంచాము. తర్వాత ఒంగోలు మందిరానికి వచినప్పుడు, వారు మమ్మును ఎంతో చక్కగా పరామర్శించారు.

మేము కబాడిపాలెంలో ఒక ఇల్లు తీసుకొని మా కుటుంబ జీవితం ప్రారంభించాం. కొంతకాలం బాగానే ఉంది. కాని మాకు సంతానము లేకపోవటం మమ్మును ఎంతో వేదనకు గురిచేసింది. స్వంత ఇల్లు లేకపోవటం కూడ ఒక సమస్యగా మారింది. ఈ రెండు విషయాల కొరకు మేము ప్రార్థించగా దేవుడు కొంతకాలమునకు మాకొక కుమారుని అనుగ్రహించాడు. స్వంత ఇల్లు కూడా అను గ్రహించాడు. కాని మా కుమారుడు చాలా అనారోగ్యంతో ఉన్నాడు. ఆర్థిక పరిస్థితులు సరిగా లేనందున ఆ బిడ్డకు సరియైన పోషణ తగినంతగా కల్పించలేకపోయాము. ఎన్ని కష్టాలు వచ్చినా ఎవ్వరికి చెప్పక దేవునిపై ఆధారపడి ఆయన సహాయం కొరకు ఎదురు చూడాలని మా తల్లిదండ్రులకు గాని, బంధువులకు చెప్తే దేవుని నామమునకు అవమానము కలుగునని తలంచి మా ఇబ్బందులను గూర్చి ఎవరికీ చెప్పలేదు. మన పితరులను పోషించిన దేవుడు మమ్మును కూడ పోషించగలడన్న విశ్వాసము నాకుంది. బిడ్డకు ఐదు సం॥ల వయస్సు వచ్చినా మాటలు సరిగా రాలేదు. దానికి తోడు బిడ్డ గోడమీద నుండి పడి చేతికి దెబ్బ తగిలింది. ఎన్ని స్వస్థత కూడికలకు వెళ్ళినా బాగుకాలేదు. చివరకు ప్రార్థనలో పెట్టి రాయవేలూరు వెళ్ళాము. దేవుని కృపనుబట్టి ఆపరేషన్ ద్వారా బిడ్డకు మాటలు వచ్చాయి. ఈ విధమైన ఎన్నో ఇబ్బందులలో, కష్టాలలో దేవుడు మమ్మును ఆదరిస్తూ తన సన్నిధికి మమ్మును నడిపించుకున్నాడు. వీటన్నిటిని బట్టి దేవునికి మహిమ కలుగును గాక! నన్ను రక్షించి తన బిడ్డగా స్వీకరించి నన్ను తనకు సాక్షిగా నిలబెట్టుకొన్న ప్రభువు మిమ్మును కూడ ఈ విధమైన సాక్షులనుగా నిలువబెట్టి మహిమ పొందవలెనని మీ కొరకు ఆయనను ప్రార్థించుచున్నాను. నా కొరకు నా కుటుంబము కొరకు మీ ప్రార్థనా సహాయము కోరుచున్నాను.

ఇట్లు,
ప్రభువు కృపలో, మీ సహోదరి,
విజయలక్ష్మీ, ఒంగోలు

# దేవుడు - సిరి

*"ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండ నేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును; మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" (మత్తయి 6:24).* దేవుని పని చేసే సంఘకాపరులకైనా, సువార్తికుల కైనా సరే ఈ వాక్యము వర్తిస్తుంది. మేము దేవుని పని చేస్తున్నాము కదా ఈ వాక్యము వర్తించదు అనుకోకూడదు ఎందుకంటే ఈ వాక్యం దేవుని పనికి సంబంధించినది కాక, మనిషి జీవన విధానానికి సంబంధించినది. పైకి దేవునికి దాసులుగా కనిపించినప్పటికీ, లోపల ధనమునకు దాసులు అవుతుంటారు. ఈ భూమి మీద మనం జీవించే టప్పుడు మనకు ఎన్నో అవసరాలు ఉంటాయి. ప్రతి మనిషికి ఆహారం, వస్త్రాలు, గృహము ప్రాథమిక అవసరాలు. వీటిని సంపాదించు కోవడానికి ప్రతి మనిషికీ డబ్బు కావాలి. కోటి విద్యలు కూటి కోసమే అంటారు కానీ ఈ కాలంలో కోటి విద్యలు కూటికే కాదు అనేక అవసరాల కోసం కూడా. దేవునితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వీటి కోసం పాటుపడు తుంటారు. మరైతే మనిషి జీవితంలో దేవుని ప్రమేయం ఏముంటుంది? దేవుడు మనిషి కోసం ఏం చేస్తాడు? మనం ఏ విషయంలో దేవున్ని నమ్మాలి? అసలు దేవున్ని నమ్మాలా వద్దా అన్న ఎంపిక దేవుడు మనిషికే వదిలేశాడు. ***"చూడుడి; నేడు నేను మీ యెదుట దీవెనను శాపమును పెట్టుచున్నాను" (ద్వితీయో. 11:26)*** అని ఏది కావాలో కోరుకొనే స్వేచ్ఛను మనిషికి ఇచ్చాడు. ఈ లోకంలో మనిషి దేవునితో సంబంధం లేకుండా తనను తానే పోషించుకోవాలంటే మనిషికి ఉన్న ఒకే ఒక్క ఆధారం డబ్బు. అదే దేవుని మీద ఆధారపడి జీవించాలనుకుంటే దేవుడు మనిషిని పోషించడానికి ఆయనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. ప్రవక్తయైన ఏలీయాని పోషించ డానికి దేవుడు కాకులను ఎన్నుకున్నాడు. వర్షాలు పడక కెరీతు వాగు ఎండి పోయినప్పుడు దేవుడు ఏలీయాను సారెపతులోని విధవరాలి దగ్గరకు పంపించాడు. అలాగే ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి కనాను దేశమునకు తీసుకెళ్ళేటప్పుడు అరణ్యంలో 40 సంగలు వారు కోరుకున్నవన్నీ ఇచ్చి వారిని పోషించాడు. వారి జీవనం కోసం వారు పంటలు పండించ లేదు, వ్యాపారాలు చేయలేదు. దేవుడు వారిని నడిపిస్తున్నాడు కాబట్టే ప్రయాణంలో వారి కాలు వాయలేదు, వారి బట్టలు పాతగిలలేదు. ఇశ్రాయేలీయు లను జీవితకాలం పోషించిన దేవుడు నిన్ను నన్ను పోషించ లేడా? మనకి కష్టమో, నష్టమో వచ్చినప్పుడు దేవుడు మనల్ని ఆదుకోవాలి అని కోరుకుంటామే తప్ప, మనం దేవుని మీద ఆధారపడి జీవించాలని కోరుకోము. అలాగని చెప్పి మనం ఏ పని చెయ్యకుండా సోమరిపోతుల్లా ఉండాలని కాదు గానీ, మనం ఏ పని చెయ్యాలన్నా దేవుని నడిపింపు కోరుకోవాలి. మనం దేవునియందు భయభక్తులు కలిగి జీవిస్తున్నప్పుడు మనమేంకోరుకోవాలో కూడా దేవుడు మనకి తెలియజేస్తాడు. ***'యెహోవాయందు భయభక్తులుగల వాడెవడో వాడు కోరుకొనవలసిన మార్గమును ఆయన వానికి బోధించును' (కీర్తనలు 25:12).*** కాబట్టి ఈ లోకంలో జీవించడానికి మనం ఆధార పడవలసింది దేవుని మీదనా? సిరి మీదనా? అన్నది మనమే నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. దేవునికి దాసులుగా ఉండేవారిని దేవుడు పోషిస్తాడు, ధనమునకు దాసులుగా ఉండేవారిని ధనము పోషిస్తుంది. అయితే ***'ధనమును నమ్ముకొనువాడు పాడైపోవును' (సామెతలు 11:28)*** అని బైబిలు చెప్తుంది. ఈ లోకంలో మన జీవించ డానికి దేవుడిని నమ్ముకుని ఆయన మీద ఆధారపడితే, ఇశ్రాయేలీయులని జీవితకాలం పోషించినట్లే మనల్ని కూడా పోషిస్తాడు. ధనమును నమ్ముకుంటే ధనమును సంపాదించ డానికి మనం పాడై పోవాల్సి ఉంటుంది. ధనమును ప్రేమించే వారు దేవుడిని, దేవుడిని ప్రేమించేవారు ధనమును ఎప్పటికీ ప్రేమించలేరు. మరి నీవు ఎవరిని ప్రేమిస్తున్నావు? దేవుడినా? ధనమునా?

15

# కృపాదానం

మరునాడు ఉదయాన్నే 5 గంటలకు గుంటూరు బయలుదేరాడు శ్యామ్. కల వస్తే స్కాలర్‌షిప్ వస్తుందా? నేను రేపల్లె వెళ్ళి మా తమ్ముడిని సహాయం అడుగుతానని రేపల్లె ప్రయాణం అయింది హన్నమ్మ. కృపాదానంకి సమ్మతం కాకపోయినా భార్య మనస్సు నొప్పించలేక ఊరు కున్నారు. హన్నమ్మగారు 8 గంటల పాసింజరుకు రేపల్లె వెళ్ళింది. 11 గంటలకు గుంటూరు ఎ.సి కాలేజి చేరాడు శ్యామ్. మే నెల కావడంతో కాలేజి నిర్మానుష్యంగా ఉంది. ఆఫీసు వద్ద అంతకుముందు సంవత్సరమే కేరి హాలులో ఉండి బి.ఈడి పూర్తి చేసిన అద్దంకి జాన్‌వెస్లీ ఉన్నాడు. జాన్‌వెస్లీ ఒంగోలు క్లౌపేట నివాసి. ముఖపరిచయం ఉన్నందున గౌరవంగా నమస్కరించి పలకరించాడు శ్యామ్.

"ఏంటి శ్యామ్? ఏం పని మీద వచ్చావు?" అన్నాడు జాన్‌వెస్లీ.

"నాకేమైనా స్కాలర్‌షిప్ వచ్చిందేమో కనుక్కుందామని వచ్చానన్నా" అన్నాడు శ్యామ్.

పెద్దగా నవ్వి, "ఫిబ్రవరి మార్చి మధ్యలో కదా స్కాలర్‌షిప్స్ వస్తాయి. నీకేమైనా కల వచ్చిందా?" అన్నాడు జాన్‌వెస్లీ.

"అవును కల వచ్చింది" అన్నాడు శ్యామ్ ఏ మాత్రం సిగ్గుపడకుండా.

స్కాలర్‌షిప్స్ ఏమిరాలేదయ్యా అన్నారు ఆఫీసు వారు.

చేసేదిలేక వెనుతిరిగి నీరసంగా మెయిన్‌గేటు దాటు తున్నా శ్యామ్‌కు వెనుకనుండి ఏవో చప్పట్ల శబ్దం విన బడింది. తిరిగి చూస్తే జాన్‌వెస్లీ అన్న .

వెస్లీ నవ్వుతూ "ఇప్పుడు నేను ఆఫీసు నుండి వస్తుం డగా హైదరాబాదు నుండి ఉత్తరం వచ్చింది. నీకు ఒక్కడికే స్కాలర్‌షిప్ వచ్చింది. అదీ 40 రూపాయలు" అన్నాడు. శ్యామ్ సంతోషానికి హద్దులు లేవు. మార్కెట్ దగ్గర ఒక బుట్టెడు మామిడి పండ్లు కొని ఒంగోలు వెళ్తున్న లారి ఎక్కాడు.

రాత్రి 12 గంటలకు శ్యామ్ ఒక బుట్టెడు మామిడి పండ్లతో ఇల్లు చేరాడు. ఇంటి ముందు రోడ్డు మీద పడక కుర్చీలో కూర్చుని ఉన్న తండ్రి కృపాదానంతో స్కాలర్‌షిప్ తనొక్కడికే వచ్చిందని, అది కూడ 40 రూపాయలు వచ్చిం దని చెప్పి, తన దగ్గర ఉన్న డబ్బులు తండ్రికి ఇచ్చాడు

"నువ్వు లోపల కూర్చో. నేను వద్దన్నా అమ్మ రేపల్లె వెళ్ళింది. ఇప్పుడు మెయిల్‌కి వస్తుంది" అని చెప్పాడు కృపాదానం. అరగంట తర్వాత మద్రాసు మెయిల్‌కి భార్య హన్నమ్మ వచ్చి మధ్య గదిలో కూర్చుని ఏడుస్తూ "ఉద్యోగాలు మాని మిమ్మల్ని దేవుని సేవ ఎవరు చెయ్యమన్నారు? ఇప్పుడు కొడుకును చదివించడానికి డబ్బులులేక చందాకి వచ్చావా?" అని "చులకనగా మాట్లాడి పైసా కూడా ఇవ్వ కుండా పంపాడు నా తమ్ముడు" అని ఏడుస్తూ చెప్పింది హన్నమ్మ.

"ప్రభువును నమ్ముకొని పనిచేసే మనం డబ్బుల కొరకు మనుష్యుల దగ్గరికి వెళ్తే దేవునికి అవమానము కాదా? ఇవిగో డబ్బులు ప్రభువు పంపించాడు. అబ్బాయి తెచ్చాడు" అన్నాడు కృపాదానం.

ఆ డబ్బులు చూపించిన తరువాత కూడా ఏడుస్తూనే ఉంది హన్నమ్మ, "ఇంకా ఎందుకు ఏడుస్తున్నావ్?" అడిగాడు కృపాదానం.

"నేను దేవునికి ఎంత అవమానం తెచ్చానండి" అని ఏడ్వసాగింది భార్య.

"తెలుసు" అన్నాడు కృపాదానం.

మరునాడు ఒంగోలు కొండ మీద – రెండు హిందు వుల సమాధుల మధ్యలో ఉన్న స్థలంలో కట్టబడిన సి.యస్.ఆర్ శర్మ కాలేజిలో చేరడానికి బయలుదేరాను. పి.యు.సి. పరీక్ష పాసైనప్పటికి ఇంకా సర్టిఫికేట్ చేతికి

రాలేదు. పి.యు.సి. హాల్ టికెట్ మాత్రం ఉన్నది. కాస్త బెరుకుగానే ఉన్నది నాకు.

కాలేజి చుట్టుప్రక్కల ఒక కిలోమీటరు దూరంలో ఒక్క ఇల్లు కూడా లేదు. శ్యామ్ కాలేజి వైపుగా నడుస్తున్నాడు. ఎదురుగా తెల్లపంచె కట్టుతో, బట్టతల గల ఒక ఆసామి వస్తున్నాడు.

ఇంతలో నా చేతిలోనుండి హాల్‌టికెట్ ఎగిరి ఎదురుగా వస్తున్న తెల్లపంచె ఆయన దగ్గరకు చేరింది. ఆయన ఆ కాగితం తీసుకొని చూసి తన వైపుగా వస్తున్న సామ్యేల్‌తో "కాలేజీలో చేరుతావా?" అన్నాడు.

"ఫిలాసఫీ తీసుకుంటావా? ఆ సబ్జెక్ట్ చెప్పేది నేనే" అని నన్ను వెంటబెట్టుకొని ప్రిన్సిపాలైన ముత్తు అయ్యర్ గారి వద్దకు తీసుకెళ్ళాడు. పి.యు.సి హాల్ టికెట్ నంబరును పేపరులో చూసి పాసైనట్టు నిర్థారించుకొని అడ్మిట్ చేసు కుందాము అన్నాడు ప్రిన్సిపాల్‌తో. ఆ మాష్టారుకు ప్రిన్సిపాల్ వద్ద మంచి పట్టు ఉండటంతో అడ్మిషన్ దొరికింది. అడ్మి షన్‌కు సంబంధించిన అన్ని పనులు ఆ మాష్టారే చూసు కున్నాడు.

ఆ మాష్టారు పేరు కృష్ణారావు. వారి నాన్నగారు డాక్టర్. తిరుమలరావు యఫ్. ఆర్.సి.యస్ (ఫెలోషిప్ ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్) ఆ కాలంలోనే ఉన్నత విద్యను అభ్యసించినవారు. వారిది విశాఖపట్నం.

కాలేజిలో అడుగు పెట్టకముందే దేవుడు తన సేవకుని కుమారుని కాలేజి అడ్మిషన్ కొరకు అన్ని ఏర్పాట్లు చేసాడు. మనం సమస్య వచ్చినపుడు దేవుని వైపు చూస్తాం. కాని దేవుడు ముందుగానే మనకొరకు అన్నీ సిద్ధపరచి ఉంచాడని గ్రహించి ఆయనపై ఆధారపడాలి.

కృపాదానం పెద్దకుమారుడు యస్.యస్.యల్.సి. పాసైన తర్వాత డాక్టరు బ్రేస్టడ్ అనబడె మిషన్ హాస్పిటల్ డాక్టరుగారి భార్య సహకారంతో గుంటూరు ఎ.సి. కాలేజిలో పి.యు.సి. చదివాడు. కాని మూడు పూటల భోజనం చేయలేని పరిస్థితుల్లో చదవడం కృపాదానం కుమారునికి ఇష్టం లేదు.

ఆ రోజుల్లో యస్.యస్.యల్.సి. చదివిన వారికి ఏదైనా ఉద్యోగం దొరికేది. చాలాసార్లు కాలేజి చదవనని మొరాయించాడు. కాని కృపాదానంగారు పట్టుదలతో ఎలాగైనా సరే కొడుకును బి.ఎ. చదివించాడు. ప్రతిరోజు మధ్యాహ్నం కుమారునికి అన్నం పెట్టలేకపోయినా బి.ఎ. చదివించాడు. తనవలె కాక తన కుమారునికి బైబిల్ కాలేజి డిగ్రీ ఉండాలని ఆశించి బి.ఎ. పాస్ అయిన కుమారుని సేవలోనికి ప్రవేశ పెట్టకుండా బి.డి. (బ్యాచలర్ ఆఫ్ డివినిటి) చదివించాలని పట్టుపట్టాడు.

ఆ రోజుల్లో ఆంధ్ర, శ్రీవెంకటేశ్వర, ఉస్మానియా యూనివర్సిటీలు మాత్రమే ఉన్నాయి. డిగ్రీ పట్టా తీసుకోవా లంటే విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటి కాన్వొకేషన్‌కు హాజరవ్వాల్సింది.

పాసింజరు బండిలో ప్రయాణించినా విశాఖపట్నం రాను పోను చార్జీలు, దారిలో పులిహోర తదితరమైన భోజన ఖర్చులు, కాన్వొకేషన్ కోటు అద్దెకు ఏడు రూపాయలు వెరసి 64 రూపాయలు అవుతాయి.

మొత్తానికి కాన్వొకేషన్‌కి ముందురోజు 64 రూపా యలు సంపాదించి నా చేతిలో పెట్టి "నాయన ప్రభువు తన దూతను నీకంటె ముందుగా పంపిస్తాడు ఈ విషయాన్ని నీవు నమ్ము" అన్నాడు మా నాన్న.

కాన్వొకేషన్ కోటులో ఫోటో కొరకు ఎనిమిది రూపా యలు కూడా ఇచ్చి ప్రార్థన చేసి రైలు ఎక్కించాడు.

ఆ పాసింజరు మరునాడు ఉదయం 3 గంటలకు విశాఖపట్నం చేరుతుంది.


**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా**
**మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే**
**ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**
**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

స్త్రీల విభాగం

# షిఫ్రా - పూయా

ఈ సంచికలో – తమ జీవితాల ద్వారా మనకు దైవిక జ్ఞానాన్ని, ఆత్మీయ సత్యాలను అందించబోతున్న ఆదర్శ స్త్రీ మూర్తులు షిఫ్రా, పూయా.

షిఫ్రా,పూయా అను వారి గురించి బైబిల్ గ్రంథం మొత్తం మీద ఒకే ఒక్కసారి ప్రస్తావించబడింది. నిర్గమ కాండం మొదటి అధ్యాయాన్ని చదివితే షిఫ్రా, పూయాల ప్రస్తావన సందర్భం అవగతమౌతుంది.

ఐగుప్తులో అత్యధికంగా విస్తరిస్తున్న ఇశ్రాయేలీయుల వలన భవిష్యత్తులో తన రాజ్యానికి ఆపద కలిగే అవకాశం ఉందని భావించిన అప్పటి ఐగుప్తు రాజైన ఫరో ఇశ్రాయేలీయుల్ని సంఖ్యాపరంగా, మానసికంగా నియంత్రించదలచి వారిని బానిసలుగా చేసి, కఠినమైన దాసత్వం చేయించ సాగాడు. అయినప్పటికి ఫరో ఆశించిన ఫలితం రాకపోగా ఇశ్రాయేలీయులు ఇంకా విస్తరించసాగారు.

ఇశ్రాయేలీయులను నియంత్రించడానికి ఫరో షిఫ్రా, పూయా అను హెబ్రీ మంత్రసానులను పిలిపించి, వారితో ఇశ్రాయేలు స్త్రీలు కాన్పు పీటల మీద ఉన్నప్పుడు వారికి మగపిల్లవాడు పుడితే వాడిని అక్కడే చంపి వేయమని, ఆడపిల్ల జన్మిస్తే బ్రతకనిమ్మని ఆజ్ఞాపించి పంపాడు.

షిఫ్రా, పూయాలు దేవున్ని ఎరిగిన హెబ్రీయులు. ఒక రకంగా చెప్పాలి అంటే విశ్వాసులు అనవచ్చు. హెబ్రీయులు తమ పితరునిగా భావించే అబ్రాహాము గురించి, అతని విశ్వాసము గురించి, అతను పొందిన వాగ్దానములను గురించి ఎరిగిన వారు. ఒంటరియైన అబ్రాహామును దేవుడు ఆశీర్వదించి ఆకాశ నక్షత్రములవలె, సముద్రపు ఇసుక రేణువులవలె అతని సంతానాన్ని విస్తరింప చేస్తానని వాగ్దానం చేశాడు. కానీ ఇప్పుడు రాజైన ఫరో హెబ్రీ మగ సంతానాన్ని చంపమని తమకు ఆజ్ఞాపించాడు. ఇది ఖచ్చితంగా దేవునికి, దేవుని వాగ్దానానికి విరుద్ధమైనదని ఇద్దరు మంత్రసానులు గ్రహించారు. దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానాన్ని నమ్మి దేవునిపై అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉన్న ఈ ఇద్దరు మంత్రసానులు దేవుని చిత్తాన్ని నెరవేర్చదలచి రాజాజ్ఞను ఖాతరు చేయలేదు.

రాజాజ్ఞను లెక్క చేయకపోవడం, అది రాజును ధిక్కరించడమే. పర్యవసానం ప్రాణాంతకం. ఆజ్ఞను ధిక్కరిస్తే కాదు. రాజుకు కోపం వస్తే చాలు ఎదుటివారి ప్రాణాలు పోవడానికి. అయినప్పటికి ఆ మంత్రసానులు రాజు చెప్పినట్లు చేయక హెబ్రీ మగ సంతానాన్ని బ్రదుకనిచ్చారు. ఆ కాలంలో ఐగుప్తు చాలా పెద్ద రాజ్యం, అంత గొప్ప రాజ్యాధినేత, అత్యున్నతమైన హోదా ఉన్న వ్యక్తి చెప్పిన మాటను పాటించకపోవడం నేరంగా పరిగణించబడుతుంది. ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిసీ కూడా ఆ మంత్రసానులు రాజు ఆజ్ఞను పాటించకపోవడానికి కారణం రాజు కంటే గొప్పవాడు, ఉన్నతమైన వ్యక్తి, సర్వాధికారియైన దేవుని చిత్తాన్ని నెరవేర్చాలనే ధృఢ సంకల్పమే. సహజంగా మనుష్యులు ఎదుటివారి శక్తి సామర్థ్యాలు, అధికారం, హోదానుబట్టి వారికి గౌరవం ఇవ్వడం, భయపడటం జరుగుతుంది. ఉదా : ఒక సామాన్యుడు. పోలీసు కానిస్టేబుల్ కంటే యస్.ఐ. అంటే కాస్త ఎక్కువ భయపడతాడు, అతని కంటే సి.ఐ అంటే ఇంకాస్త భయం కలిగి ఉంటాడు. అందరి కంటే యస్.పి అంటే మరికొంత ఎక్కువ భయం కలిగి ఉంటాడు. ఇది జిల్లా పరిధిలో, అంటే ఎవరి మాటైతే ఖచ్చితంగా చెల్లుబాటు అవుతుందో, ఎవరైతే తన పరిధిలో అందర్నీ నియంత్రించగలడో వారికి భయపడతాం. అలానే షిఫ్రా, పూయాలు కూడా ఐగుప్తు రాజు కంటే గొప్పవాడు, అత్యున్నతుడూ, సర్వాధికారియైన దేవునికి భయపడ్డారు. ఆ దేవదేవునికి ఈ లోకంలోని అన్ని అధికారాల మీద, అందరి అధికారుల మీద పూర్తి నియంత్రణ కలదని నమ్మారు. అందుకే (ఆయనకు) ఆ దేవ దేవునికి భయపడి రాజాజ్ఞను ధిక్కరించారు.

సహజంగా అందరూ దేవునికి భయపడతారు కాని ఆయన సార్వభౌమాధికారి అని గుర్తించరు. ఆయన సర్వాధి కారి అని మనం గుర్తిస్తే మన జీవితాలలో ఆయన అత్యున్నత మైన వ్యక్తిగా ఉండాలి. మనకు ఎదురయ్యే సమస్యలలో, సందిగ్ధతలో, సంశయాలలో మన విచక్షణ లోక మర్యాదలకు కాక, ఆయన అధికారానికి, చిత్తానికి తలవంచినప్పుడే ఆయన సర్వాధికారి అని మనం నమ్మినట్లు. ఈ నమ్మికే క్రైస్తవ విశ్వాస పునాది. ఇదే నిజమైన భక్తి. ఈ భక్తి కేవలం ఆయన సర్వాధికారి అని గుర్తించి, ఆయనకు భయపడు వారు మాత్రమే చూపగలిగేది..

షిఫ్రా, పూయాలు దేవుని సర్వాధికారాన్ని గుర్తించిన నిజమైన భక్తిపరులు. నిజమైన ప్రమాణాలలో దేవునిని దేవునిగా గుర్తించి తమ క్రియల ద్వారా ఆరాధించిన విశ్వాస వనితలు.

భయపడటం రెండు రకాలుగా ఉంటుంది. మొదటిది, మనం ఏదైనా నష్టపోతామేమో అనే భావన మూలంగా కలిగేది. నేటి క్రైస్తవలోకం ఈ భావనతోనే దేవుడంటే భయం, తద్వార రకరకాల క్రైస్తవ కార్యక్రమాలలో పాల్గొని భక్తిని కనపరుస్తారు. కానీ అది ఆచారపరమైన భక్తి మాత్రమే అది దేవునికి దగ్గరగా మనలను నడిపించలేదు. రెండవది, దేవుని ప్రేమను, వ్యక్తిత్వాన్ని ఎరిగిన వారు దేవునికి వ్యతిరేకంగా బ్రతకడానికి భయపడటం. ఈ భయం నిజమైన భక్తి భావనను మనలో కలిగించి దేవునికి సన్నిహితంగా జీవించుటకు ఉపయోగపడుతుంది. అందుకే భయభక్తులు అనే మాట బైబిల్లో చాలా విరివిగా వాడబడింది.

షిఫ్రా, పూయాలు దేవుని సార్వభౌమాధికారాన్ని గుర్తించి ఆయనకు భయపడి, ఆయన చిత్తాన్ని నెరవేర్చు నిమిత్తం రాజాజ్ఞను లెక్క చేయక నిజమైన భక్తిని కనుపరిచారు. షిఫ్రా, పూయాలు దేవునియందు భయభక్తులు కలిగిన స్త్రీలు. ఫలితంగా దేవుడు వారికి మేలు చేశాడు. నేటితరం క్రైస్తవ స్త్రీలుగా, సంఘంలో విశ్వాసులుగా ఉన్న ప్రతి క్రైస్తవ విశ్వాసి నిజంగా దేవునియందు భయభక్తులు కలిగి ఉన్నారా? ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా తమను తాము దేవునియందు తమకున్న భయభక్తులను గురించి ప్రశ్నించు కొని తమ విశ్వాస జీవితాన్ని పరిశీలించుకోవాలి. ప్రతి స్త్రీ తన జీవితంలో ఏదో ఒక సంధర్భంలో దేవుని అనుసరించు విషయంలో ఒక సందిగ్ధతను ఎదుర్కోవలసి వస్తుంది. ఆ సమయం నీవు తీసుకున్న నిర్ణయిం దేవునికి నిన్ను దగ్గర చేసిందా? లేక అందరివలె లోకం పోకడలకు తలవంచి ఆచారపరమైన భక్తిని కనపరుస్తూ లోకానుసారమైన జీవితాన్ని జీవిస్తున్నావా?

షిఫ్రా, పూయాలు తమ ప్రాణాలను లెక్క చేయలేదు. వారికి కుటుంబం, పిల్లలు, బాధ్యతలు ఉండి ఉండవచ్చు. అయితే వారు లోకానుసారమైన బాధ్యతల కంటే, తమకంటే ముందు దేవునికి విలువ ఇచ్చి దేవుని కొరకు నిలబడ్డారు. ఫలితంగా వారు క్రైస్తవ స్త్రీ జాతికి ఆదర్శవంతంగా నిలబడ్డారు, పరిశుద్ధ గ్రంథంలో స్థానం సంపాదించారు.

మనం కూడా షిఫ్రా, పూయాలవలె ఆదర్శప్రాయమైన క్రైస్తవ జీవితానికి ఆధారమైన భయభక్తులు కలిగి దేవదేవునికి దగ్గరగా జీవిద్దాము.

'హన్నాకృప' పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలు కరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నడుపగలుగుతున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 350/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయంతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను. **– ఎడిటర్**

చిన్నపిల్లల పేజి

# ప్రేమించుట

స్కూల్ నుండి ఉత్సాహంగా వచ్చిన రమ్య అరుస్తునట్లుగా తన తల్లిని పిలుస్తూ వంటగదిలోకి వచ్చి మరో వారంలో తమ స్కూల్లో ఫెస్ట్ జరగబోతుందని చెప్పింది. ఫెస్ట్ అంటే అడిగింది తల్లి. ఫెస్ట్ అంటే పండగ, అన్ని రకాల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి మంచి బహుమతులను ఇస్తారు స్కూల్ యాజమాన్యం. అంటే, పాటల పోటీలు, నృత్యా ప్రదర్శన వ్యాసరచనలు, క్విజ్, సైన్స్ ప్రాజెక్ట్స్, ఫ్యాషన్ షో, ఇంకా అనేక రకాల పోటీలు జరుగుతాయి. అదంతా ఒక పండగ వాతావరణాన్ని కలుగజేస్తుంది. అందుకే దానిని ఫెస్ట్ అంటారు అంది రమ్య తల్లితో. మరి నువ్వు ఏ పోటీలో పాల్గొంటున్నావు అడిగింది తల్లి. డ్యాన్స్ కాంపిటీషన్లో మమ్మీ చెప్పింది రమ్య ఎంతో ఉత్సాహంగా. డ్యాన్స్ కాంపిటీషనా? అన్నది తల్లి కాస్త నీరసంగా. అవేవి పట్టించు కోని రమ్య అవును మమ్మీ, నేను డాన్స్ పోటీలు పాల్గొనాలనుకుంటున్నాను. మంచి మంచి డ్రస్సులు, మేకప్ వేసుకోవచ్చు. పైగా మనం వేసే స్టెప్పులకు అందరూ మెచ్చు కుంటు చప్పట్లు కొడతారు. అలా అందరూ మనలను మెచ్చు కుంటే ఎంత సంతోషంగా ఉంటుందో తెలుసా! పైగా డ్యాన్స్ స్టెప్స్ నేర్పించడానికి ఒక డ్యాన్స్ మాస్టర్ని కూడా స్కూల్ వాళ్ళే ఏర్పాటు చేశారు అని చెప్పసాగింది రమ్య ఉత్సాహం, సంతోషం కలగలిసిన స్వరంతో. రమ్య ఉత్సాహాన్ని నీరు గారుస్తూ తల్లి చూడు రమ్య నువ్వు డ్యాన్స్ కాంపిటీషన్లో పార్టిసిపేట్ చేయకూడదు. దానికి నేను ఒప్పుకోను అంది.

పిడుగులాంటి ఈ మాట విన్న రమ్య ఎందుకని మమ్మీ అడిగింది అతి మెల్లని స్వరంతో. మీరు డ్యాన్స్ వేసేది సినిమా పాటలకే కదా ! మనం క్రైస్తవులం, అల్లరితో కూడిన ఆట పాటలలో పాల్గొన వద్దని బైబిల్ చెప్తుంది కదా! కాబట్టి నువ్వు ఆ డ్యాన్స్ పోటీలలో పాల్గొనకూడదు అంది తల్లి. తల్లి సమాధానం విన్న రమ్యకు ఎక్కడలేని ఏడుపు వచ్చింది. మమ్మి మన చర్చికి వచ్చే నిమ్మి, షారోన్ వాళ్ళు కూడా డ్యాన్స్ పోటీలో పాల్గొంటున్నారు. మమ్మీ ప్లీజ్ అని బ్రతిమి లాడింది రమ్య. తల్లి ససేమిరా అనడంతో కోపంగా తన గదిలోకి వెళ్ళింది రమ్య.

తన తల్లి అంత కఠినంగా ప్రవర్తించడం రమ్యకు అస్సలు నచ్చలేదు. అయినా అందరూ డ్యాన్స్ కాంపిటిషన్లో పార్టిసిపేట్ చేస్తుంటే, వాళ్ళ తల్లిదండ్రులు అనుమతివ్వగా తనకు మాత్రమే ఈ కట్టడి ఏంటి? మమ్మీ ఎందుకు ఇలా మాట్లాడుతుంది? నేను సంతోషంగా ఉండటం అమ్మకు ఇష్టం లేదా? అందరూ ఎంతో ఉత్సాహంగా పోటీలలో పాల్గొంటుంటే తను మాత్రం బిక్కముఖం వేసుకొని కూర్చోవాలి. రకరకాల ప్రశ్నలతో, ఆలోచనలతో ఎటు తేల్చుకోలేక ఏడుస్తూ నిద్రలోకి జారుకుంది రమ్య.

రాత్రి ఆఫీసు నుండి వచ్చిన రమ్య తండ్రి రమ్య కొరకు ఒక మంచి డ్రెస్ తెచ్చి, రమ్యకు ఇచ్చి ఆమె కళ్ళల్లో ఆనందం చూడాలని, రమ్యా, రమ్యా అని పిలవసాగాడు. కానీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఏంటి? అన్నట్లు భార్య వైపు చూడగా పరిస్థితి మొత్తం చెప్పింది రమ్య తల్లి.

కాసేపు మౌనంగా ఉన్న రమ్య తండ్రి చిన్నగా రమ్య గదిలోకి వెళ్ళి నిద్రలేపి ఆమెకు తెచ్చిన క్రొత్త డ్రెస్సు ఇచ్చాడు. చాలా క్యాజువల్గా డ్రెస్ తీసుకుంది. ఆమె ముఖంలో ఎటువంటి సంతోషం లేదు. ఏమైంది తల్లీ అడిగాడు తండ్రి ఏమీ తెలియనట్లు. రమ్య తన బాధనంత తండ్రితో చెప్పి చూడు డాడీ, నాకు సంతోషాన్ని ఇచ్చే డ్యాన్స్ పోటీలలో పాల్గొనవద్దు అంటుంది మమ్మీ, ఇది న్యాయమేనా? అసలు మమ్మీకి నేనంటే ఇష్టం లేదు. అసలు మమ్మీ నన్ను ప్రేమిస్తుందా? అనే అనుమానం కలుగుతుంది. నువ్వైనా మమ్మీతో చెప్పు డాడీ అంది గారంగ.

తండ్రి రమ్యను దగ్గరకు తీసుకొని మీ మమ్మీ నిన్ను ప్రేమిస్తుందో లేదో తరువాత సంగతి. నువ్వు మీ మమ్మీని ప్రేమిస్తున్నావా? దూ యు లవ్ యువర్ మామ్? అడిగాడు

తండ్రి. అదేంటి డాడీ అలా అడిగావు అయినా ఇప్పుడు నేను మమ్మీని ప్రేమించట్లేదని నీకెందుకు అనిపించింది? అడిగింది రమ్య. అవన్నీ వద్దు జస్ట్ నా ప్రశ్నకు సమాధానం చెప్పు. నీవు మీ మమ్మీని ప్రేమిస్తున్నావా? అన్నాడు సూటిగా.

యస్ డాడ్ అంది రమ్య ఎంతో కాన్ఫిడెంట్‌గా. నీవు మమ్మీని ప్రేమిస్తే ఆమె మాట వినాలి అన్నాడు తండ్రి. అదేంటి డాడీ మమ్మీని ప్రేమిస్తే నా ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టి మమ్మీ మాట వినాలా? అంది రమ్య ఆశ్చర్యంగా.

అవును, యేసయ్య తన తండ్రియైన దేవున్ని ప్రేమించాడు కాబట్టే ఎంత బాధైనా మాట విని, తండ్రి చెప్పినట్లు సిలువపై మరణించాడు. సిలువ మరణం ఎంత భయంకరం, నొప్పిని భరించాలి. దానిని ఎవరైనా కోరుకుంటారా? ఇష్టపడతారా? కాని యేసయ్య తన తండ్రిని ప్రేమించి ఆయన మాట విన్నాడు. అందుకే మనందరి కొరకు సిలువపై మరణించాడు. ఫలితంగా ఈ రోజు దేవునితో సమానంగా అందరి పూజలు అందుకుంటున్నాడు చెప్పాడు తండ్రి. అంటే నీవు మీ అమ్మను ప్రేమిస్తే ఆమె మాట వింటావు. డ్యాన్స్ పోటీలో పాల్గొనవు అన్నాడు తండ్రి. రమ్య ఆలోచనలో పడింది. తల్లి మీద కోపం కాస్త తగ్గింది. తండ్రి ఇచ్చిన క్రొత్త డ్రస్సు కొరకు థ్యాంక్స్ చెప్పింది తండ్రికి.

మరునాడు రమ్య తల్లితో మంచిగా మాట్లాడి తను అల్లరితో కూడిన ఆటపాటలలో పాల్గొనని తల్లికి ప్రామిస్ చేసి స్కూల్‌కి వెళ్ళింది. అందరూ డ్యాన్స్ వేస్తుంటే తనకు డ్యాన్స్ చేయాలి అనిపించినా తండ్రి మాటలు గుర్తుకు వచ్చి అక్కడ నుండి దూరంగా వెళ్ళింది. అనుకోకుండా సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాల్సిన అమ్మాయి అనారోగ్యం పాలవ్వడంతో ఆ స్థానాన్ని రమ్య భర్తీ చేయవలసి వచ్చింది. అయిష్టంగానే ఒప్పుకున్న రమ్య దేవుడు తనకిచ్చిన పనిగా భావించి ఎగ్జిబిషన్‌లో పాల్గొంది. అతిధిగా విచ్చేసిన కలెక్టర్ గారు రమ్య ప్రాజెక్టును మెచ్చుకొని పూల మాల వేసి ఆమెను అభినందించాడు. కరతాళ ధ్వనులు మిన్నంటగా రమ్య హృదయం సంతోషంతో నిండిపోయింది. మనసులోనే దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంది రమ్య.

**పరిశుద్ధగ్రంథ పరిశోధన పట్టిక -14 జవాబు**


| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఆ | 2 సా | | | | 3 సి | 4 మాం | టా | 5 జ |
| 6 మే | ర | 7 బు | | 8 హో | మా | ను | | మ్మ |
| న్ | | 9 హో | 10 ఆ | జు | | 11 ము | ర | ప |
| | 12 పు | రా | సె | | 13 త్రం | స | | డ |
| 14 మీ | కా | | 15 న | షె | గో | | 16 ఆ | వ |
| త | | 17 సం | తు | | 18 ను | 19 గో | దా | |
| 20 తా | బి | త | | 21 ను | దా | మె | | 22 షే |
| లీ | | 23 తి | 24 మో | తి | | 25 రు | 26 గూ | ఆ |
| 27 కు | రే | ని | యు | | | | 28 నీ | రు |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 14**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. వి. రత్నమ్మ, హైదరాబాద్
4. టి. జాన్‌విక్టర్, నంద్యాల
5. శ్రీమతి బి. ఆనీమేరి, హైదరాబాద్
6. బి. ఎస్తేరు, గుంటూరు
7. పి. శాంతాగ్రేస్, మచిలీపట్నం
8. కె. సాల్మన్‌రాజు, కొత్తగూడెం

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 15

**అడ్డం:**

6. బేతనియ యెరూషలేముకు మధ్యగల దూరం (3) (యోహాను)
8. ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది. ఆయన----కాపురముండును (3) (ప్రకటన)
10. తారుమారైన అబ్షాలోము కుమార్తె (3) (2 సమూ)
11. లోతు పెద్దకుమార్తె కుమారుడు (3) (ఆది)
13. ఆయన నీ --- తొట్రిల్లనియ్యడు (3) (కీర్తన)
15. అహాబు తండ్రి (3) (యిర్మీయా)
16. తిరగబడిన మొర్దెకై వంశం (3) (ఎస్తేరు)
18. నన్ను గూర్చి విచారణ చేసిన నా ప్రజల నిమిత్తము --- గొఱ్ఱెల మేత భూమియగును (3) (యెషయా) (తిరగబడింది)
20. ఒమ్రీ కుమారుడు (3) (1రాజులు)
21. యెరూషలేముకు ఆమడ దూరమున ఉన్న గ్రామం తారుమారైంది (3) (లూకా)
23. --- వలె వివేకులును పావురముల వలె నిష్కపటులునై యుండుడి (3) (మత్తయి)

**నిలువు:**

1. కర్కెమీషు మీదకు దండెత్తి వెళ్ళిన ఐగుప్తు రాజు (2) (2 దిన)
2. యేసుక్రీస్తు నిన్న -- ఒక్కటే రీతిగా ఉన్నాడు (2) (హెబ్రీ)
3. తోక తెగిన యెషయా ప్రవక్త రెండవ కుమారుని పేరు (9) (యెషయా)
4. -- పాపినైన నన్ను కరుణించుమని సుంకరి పలికెను (2) (లూకా)
5. ఘనులును పెద్దలును తల కల్లలాడు ప్రవక్తలు -- (2) (యెషయా) (తలక్రిందులైంది)
7. దావీదు సోదరి, యోవాబు తల్లి (3) (1దిన)
9. తలక్రిందులైన ఏథెన్సు స్త్రీ (3) (అపొ.కా)
11. అహరోను చనిపోయి పాతిపెట్టబడిన ప్రదేశము (3) (ద్వితియో)
12. తలక్రిందులైన మోసగాడు (3) (ఆది)
13. పరిశుద్ధ దేవుడు ---లో నుండి వేంచేయుచున్నాడు (3) (హబక్కూకు)
14. తలక్రిందులైన మెల్కీసెదెకు రాజ్యం (3) (ఆది)
17. నా దేవా అని అర్థమిచ్చు సిలువ సప్తపదాలలో ఒకటి (3) (మార్కు) (తలక్రిందులైంది)
19. నిశ్చయముగా అతడు మన --- లను భరించెను (3) (యెషయా)
21. వ్యభిచారమందు పట్టబడిన స్త్రీని యేసు ఇలా సంబోధించెను (2) (యోహాను) (తలక్రిందులైంది)
22. సమస్త భూ జంతువులలో సర్పము -- గలది (2) (ఆది)
23. పౌలు అబద్ధ ప్రవక్తయైన బర్‌యేసును చూచిన ఊరు (2) (అపొ.కా)
24. గిత్తీయుడైన గొల్యాతు సహోదరుడు (2) (1దిన)